# స్వతంత్ర రైతాంగం

(కాపిటలిజానికి, కమ్యూనిజానికి మ్రింగుడుపడని రైతువర్గం)

★

మూలం:

**ఆచార్య రంగా**

అనువాదకులు:

తోటకూర శ్రీరామమూర్తి

నల్లమోతు రాజగోపాలరావు

★

స్వతంత్ర ప్రచురణలు - చీరాల

మొదటి ప్రచురణ : మే, 1968
కాపీలు : 2000

వెల : 1—00

నలందా ప్రెస్, మారీసు పేట, తెనాలి - 2.

# ముందుమాట

ఎన్నో దేశాలు. ఎన్నో జాతులు. ఎన్నో భిన్నభిన్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు.

అన్నింటిలోనూ రైతాంగంవుంది. మానవచరిత్ర ప్రారంభంనుండీ నేటివరకూవుంది. ముగింపువరకూ వుంటుంది. అంతేకాదు. ఇన్ని భిన్న దేశాల, జాతుల, వ్యవస్థల మధ్యవున్న రైతాంగ లక్షణాలు, గుణాలు, సమస్యలు - మన స్తత్వాలు స్థూలంగా ఒక్కటే. ప్రపంచ 'రైతాంగం' అన్నమాటకు పోషణ యీ లాక్షణికమే ఒనగూరుస్తున్నది.

ఈ లక్షణాన్ని 'మార్క్స్' ఒకరంగులోంచి పరికించాడు. అందుకు కారణం అతని సిద్ధాంత తత్త్వస్వరూపం కావచ్చు. భూతద్దంలోంచి చూడ బడిన కొన్ని పరిస్థితుల ప్రభావంకావచ్చు.

'మార్క్స్' దృష్టికి సరీగా వ్యతిరేక కోణంనుంచి ఆచార్య రంగా రైతును పోల్చి సిద్ధాంతీకరించారు. 'రైతు' కు సంబంధించిన 'మార్క్స్' సిద్ధాంతం తప్పనీ, సత్యదూరమనీ-తత్ విరుద్ధమైన ఆచార్య రంగా సిద్ధాంతం వాస్తవికతకు, మానవతకు, నిత్యసత్యానికీ సన్నిహితమైనదని ప్రస్తుతం కమ్యూనిస్టు దేశాలనబడే వాటిలో క్రమేణా కన్పిస్తున్న పరిణామమే ఋజువు పరుస్తున్నది.

'రైతు పెట్టుబడిదారు కనుక విప్లవ నిరోధకుడు' అన్న రెండు విశేష ణాలూ సంకుచిత సిద్ధాంతీకరణను మాత్రమే సూచిస్తాయి.

రైతు పెట్టుబడిదారుకాడు. మరొకరి శ్రమను దోచుకుని, తాను సుఖించువర్గం పెట్టుబడిదారీ వర్గమైతే, రైతు పెట్టుబడిదారు యెట్లాకాగ లడు ? స్వయంగా కాయకష్టంచేసి, తనశ్రమను తాను అనుభవిస్తాడు రైతు. సస్యాంకృషి, రైతుకు స్వయం స్వేచ్ఛావృత్తిని యిచ్చింది. మరొక క్రింద ఉద్యోగం చేయకుండా జీవించగల వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ కాజాలదు. మరొకరిని పీడించి జీవించే వ్యవస్థ మాత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థకాగలదు.

ఇక మరొకరి శ్రమతో తాను సుఖపడే వ్యక్తిమాత్రమే విప్లవ నిరోధకుడు కాగలడు - 'విప్లవం' అంటే 'మంచికోసం మార్పు' అన్న అర్థం చెప్పుకుంటే, తన శ్రమపై తాను జీవించే 'వ్యక్తి'కి యీ 'మార్పు' వల్ల మంచే జరిగితీరాలి.

కాని 'మార్క్సు' ఆశించిన 'విప్లవంలో' యీ 'వ్యక్తి'కి యీ మంచి జరగలేదు. కారణం అది మంచికోసం జరిగిన 'మార్పు' కాకపోవటం కావచ్చు. 'మార్క్సు' విప్లవం యీ దృష్టితో పరికించబడినప్పుడు — మార్క్సుచేత 'విప్లవనిరోధకులు'గా రైతాంగం అన్పించుకోవటం — విచారకారణం కాకపోగా, గర్వకారణం కాగలుగుతుంది కూడాను.

'మార్క్సు' సిద్ధాంతీకరించింది సంకుచితమైన విప్లవశక్తి. దాని పరిధులు, ఫలితాలు కూడా నియమితమైనవీ, అశాశ్వతమైనవీను.

'రైతు'లో ఆచార్య రంగా సిద్ధాంతీకరించిన 'విప్లవశక్తి' విస్తృతమైనది, శాశ్వతమైనది — అన్నింటికీ మించి వాస్తవికమైనది.

తన్ను ధ్వంసం చేయ తలపెట్టే బృహత్ యత్నాలను యెదుర్కొని నిల్చి — తన్నుతాను స్థిరంగా శాశ్వితం చేసుకోగల 'విప్లవశక్తి' రైతుకు వుంది. ఈశక్తి అజరామరమైంది. ఈ విప్లవజ్యోతి ఆర్పివేయటం అసాధ్యం అసంభవం అని — ఆధునిక కమ్యూనిస్టు దేశాల చరిత్రలు క్రమేపి స్పష్టపరుస్తున్నవి. ఎంతటి బలవత్తర వ్యతిరేక వాతావరణంలోనైనా నిబ్బరించుకుని, తిరిగి తలయెత్తి నిల్చి, స్వయంపోషకంతో స్వయంప్రకాశితంకాగల మహత్తర 'విప్లవశక్తి' రైతులో కలదన్న వాస్తవసత్యాన్ని గుర్తించ లేక పోవటం 'మార్క్సు'లో గల మహాలోపం.

ఆ వాస్తవ సత్యాన్ని గుర్తించటమే కాకుండా — సిద్ధాంతీకరించి— దేశదేశాల చరిత్రల్లోని ప్రస్తుత పరిణామాలద్వారా ఆ సిద్ధాంత వైశిష్ట్యాన్ని నిరూపించి చూపడం ఆచార్య రంగాలోని ముఖ్యవిశిష్టత.

ఈ విశిష్టతను యీ గ్రంథం అతిస్పష్టంగా, సునిశితంగా ప్రదర్శిస్తుంది. ఆచార్య రంగా అద్వితీయ మేధస్సునూ, రైతాంగంపట్ల ఆయనకుగల అచం

చల విశ్వాసానికీ — ప్రపంచ రైతాంగ సమస్యలపట్ల వారికిగల పూర్ణ నిశిత విజ్ఞానానికీ యీ గ్రంథం ఒక దర్పణం.

ఈ గ్రంథంలోని మొదటి అధ్యాయం తెలుగించిన మిత్రులు శ్రీ నల్లమోతు రాజగోపాలరావు, శ్రీ తోటకూర శ్రీరామమూర్తి గారలు విద్యార్థికులు. ఆచార్య రంగా గారిపట్ల, వారి సిద్ధాంతంపట్ల అచంచల విశ్వాసం గల యువకులు. వారి అనువాదంలో అడుగడుగునా యీ సిద్ధాంతంపట్ల వారికి గల అనుబంధం — సిద్ధాంతీకరణలోని విశేషణాలతో వారికి గల ప్రవేశం — స్పష్టంగా కన్పిస్తున్నాయి. సిద్ధాంతీకరణ గ్రంథాలను అనువదించటం కష్టసాధ్యం. కష్టసాధ్యమైన యీ కార్యాన్ని ప్రశంసనీయంగా నిర్వహించిన యీ యిద్దరకూ నా అభినందనలు.

బాపట్ల,<br>25-5-68. — పసుపులేటి కోటేశ్వరరావు

# మా మాట

ప్రపంచ రైతు సిద్ధాంతకర్త పూజ్యరంగాజీ వ్రాసిన ఆంగ్లగ్రంథం "Credo of World Peasantry" లోని "Capitalism and Communism Fail to Swallow Peasantry' అను అధ్యాయానికి యీ పుస్తకం తెలుగు అనువాదం.

"రంగా పెట్టుబడిదారుల పక్షమని" కొందరు దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారు. రంగాజీ పెట్టుబడిదారులకే కాక ఫ్యూడలిస్టులకు కమ్యూనిస్టులకు కూడా వ్యతిరేకియని ఆయన ప్రవచించిన ప్రజాస్వామ్య రైతుకూలీ కళాకార బుద్ధిజీవిరాజ్యం పైవర్గాలన్నిటికి భిన్నమైనదని ఋజువుపరిచే భాగమే యీ అనువాదం.

ఆ సత్యాన్ని ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన మహాసభలలోనే అందజేద్దామనే ఆదుర్దాతో యీ అధ్యాయాన్ని తెనిగించి గ్రంథరూపంలో తీసుకురాదలచాం. కాని ఫలించలేదు. ఇది మా ప్రథమ ప్రయత్నం. సహృదయతతో రైతు సిద్ధాంత గ్రంథం మొత్తాన్ని పాఠకులకందజేసే ప్రయత్నాన్ని కూడా ఆశీర్వదించ గలందులకు కోరుతున్నాము.

ఈ అనువాదాన్ని సహృదయతతో పర్యవేక్షించి ముందుమాట వ్రాసిన ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర యూత్ ఫోరం అధ్యక్షులు శ్రీ పసుపులేటి కోటేశ్వరరావుగారికి మా కృతజ్ఞత.

ఉద్యమ బాధ్యతలను యువకులు స్వీకరించాలని చెబుతూ ప్రోత్సాహపరిచే మా డాక్టరు శ్రీ వై. ప్రతాప్ కుమార్ గారికి మా ధన్యవాదాలు.

ప్రింటింగువర్క్సు, Proof reading పర్యవేక్షించిన శ్రీ దావులూరి సోమశేఖరరావు, శ్రీ కొండాలి వీరయ్యగార్లకు మా ధన్యవాదములు.

చీరాల,
27-5-68.

తోటకూర శ్రీరామమూర్తి
నల్లమోతు రాజగోపాలరావు
ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర యూత్ ఫోరం

## కాపిటలిజానికి, కమ్యూనిజానికి
## లొంగుబడని రైతాంగం

కాపిటలిస్టులూ, కమ్యూనిస్టులూ వారియొక్క పారిశ్రామికీకరణ విధానంతో రైతాంగాన్ని మటుమాయం చేయాలని గట్టిగా భావించారు. కాని ఆచరణలో యీ వ్యవసాయరంగం అన్నిటికన్నా మిక్కుటమైన ధనబలాన్నికూడా ధిక్కరిస్తూనే వచ్చింది. రైతాంగం ఎల్లప్పుడూ పారిశ్రామికులకూ, వ్యాపారస్థులకూ తగినట్లుగా వారి వారి పెరుగుతున్న అవసరాలను తీరుస్తూ, బలాన్ని, తెలివిని, సర్దుబాటుతనాన్ని ప్రదర్శిస్తూ పెట్టుబడిదారీ విధానం ప్రవేశించే మార్గాలను నిరోధిస్తూ వచ్చింది. కాపిటలిస్టులుకూడా వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టి వ్యాపారంచేసేకన్న కీలకపరిశ్రమల ద్వారా రైతాంగాన్ని దోపిడీ చేయడం ఎక్కువ లాభదాయకంగా భావించారు, రైతాంగాన్ని సమూలంగా నాశనం చేయడానికి కంకణంకట్టుకున్న కమ్యూనిస్టులుకూడా, రైతాంగంయొక్క సహాయనిరాకరణోద్యమం, పనిలో మందకొడి సమ్మె విధానానికి, కార్యక్రమంలో వెన్నుపోటుపొడిచే ప్రయత్నానికి తట్టుకోలేక వారితో రాజీపడటమే మంచిదని తెలుసుకున్నారు. కాబట్టి చైనాలో రైతులమీద సాధువైన పద్ధతిని అవలంభించారు. ప్రపంచ రైతాంగచరిత్ర యూవత్తూ రైతులు వారు

ఎదుర్కొనలేని తుపానువచ్చినప్పుడు తాత్కాలికంగా తలలు వంచినప్పటికీ, వేరును అంటిపెట్టుకొనివుండి జీవించే శక్తితో, వారి గ్రామీణ వాతావరణంద్వారా నేర్చుకున్న ఉపాయాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు.

రైతాంగం స్వేచ్ఛాయుతమైన, అభ్యుదయకరమైన ప్రత్యేకవర్గం. కార్మికవర్గంలాగే రైతాంగంకూడా పెట్టుబడిదారీవిధానాన్ని నాశనంచేయాలని కంకణంకట్టుకున్నటువంటిది. రైతాంగానికి చిన్న కమతాలయందు ప్రేమ ఎక్కువ. ఆ ప్రేమ ఆధునిక లక్షణాలైన ఆర్థిక వికేంద్రీకరణ, అధికార వికేంద్రీకరణలకు వ్యతిరేకం కాదు. ప్రజాస్వామ్యమే వారియొక్క ప్రధానబలం. వారి మనుగడకూ, అభివృద్ధికొరకూ జరిపే పోరాటంలో సహకారసంఘాలే ప్రధాన ఆయుధాలు.

ఓడిపోతూవున్న కమ్యూనిజాన్ని గురించి ఆలోచించే ముందు, ఇప్పటికే పరాజయాన్ని చెందిన పెట్టుబడిదారి విధానాన్ని గురించి పరిశీలించుదాం. ఆశ్చర్యకరమైన విషయమేమంటే చరిత్రలో అత్యంత బలమయిన ఆర్థికశక్తులపై విజయాన్ని సాధించిన ఆధునిక పెట్టుబడిదారీ విధానం వ్యవసాయ రంగాన్ని లోబరుచుకొనలేక పోవుటయేగాక, వ్యవసాయమే జీవనముగాగల వందలకోట్ల రైతాంగాన్ని తలచిన విధంగా తుడిచివేయలేకపోయింది. వాస్తవానికి చాలామంది పెట్టుబడిదారులు, ఆంగ్లో, అమెరికన్ ఆర్థికవేత్తలు, మరియు ఐరోపా చరిత్రకారులు, ఇక కమ్యూనిస్టులు సరేసరి

వీరంతా భారీపరిశ్రమలలాగే వ్యవసాయరంగం కూడ యాంత్రికమై పెట్టుబడిదారీ విధాన ప్రభావపరిధిలో కలిసిపోగలవని రెండవప్రపంచయుద్ధానంతర కాలంవరకు నమ్మకంగా ఊహిస్తూ వచ్చారు. వ్యవసాయరంగం యావత్తూ యాంత్రికంగా మారిపోయినట్లు కలలుగన్నారు. ఆ దృష్టితోనే వ్యావసాయిక యంత్రాంగాన్ని తయారుచేయడానికి వారు ఫ్యాక్టరీలను కట్టారు. నిజానికి రష్యా వ్యావసాయికరంగంలో ఎక్కువ భాగం చివరకు ఆ రూపానికే వచ్చింది. కాపిటలిస్టు సమాజ చారిత్రక పరిణామపద్ధతులలో పెట్టుబడిని కూడబెట్టే పద్ధతిని గురించి వ్రాస్తూ మార్క్స్ రైత్వారీవ్యవసాయాన్ని ఒక "చిన్నతరహా పరిశ్రమ"గా వక్రంగా వర్గీకరించి "అది తన నాశనాన్ని తానే చేసుకుంటుంద"ని నమ్మకంతో ప్రకటించాడు. సమాజ గర్భంలో కదిలాడే శక్తులు, ఉద్రేకాలూ, యీ ఉత్పత్తి విధానాన్ని ఒక సంకెలలాగు భావిస్తవి. "అది నాశనమై తీరాలి; నాశనమై తీరుతుంది. వారి శ్రమాధారమైన; జీవనాధారమైన భూములనుండి యీ అత్యధిక సంఖ్యగా వున్న జనాన్ని నెట్టివేయడం ఒక వరుసక్రమంలో బలవంతమైన వత్తిడి పద్ధతులద్వారా జరుగవలసినదే" "నిర్ధాక్షిణ్యమైన రౌడీచర్యలతో; అపఖ్యాతికరమైన, అధమమైన, నీచమైన, అసహ్యకరమైన ఉద్రేకాలతో (Capital Vol II P 844-845) ఇంగ్లండులోను, ఐర్లండులోను ఆ విధమైనమార్పు జరిగిందని ఆయనకు తెలుసు. కాని బాధాకరమైనప్పటికీ

ప్రపంచ వ్యవసాయ రంగంలో యీరకమైన మార్పు అనివార్యము అని ఆయన భావించాడు. ఎందుకనగా "సమాజ గర్భంలో కదిలాడే శక్తులు, ఉద్రేకాలూ యీ ఉత్పత్తి విధానాన్ని ఒక సంకెలలాగు భావిస్తవి".

నియంతృత్వశక్తితోను, పారిశ్రామిక కార్మికశక్తితోను దోపిడీ వర్గమైన పెద్ద భూస్వాములనే (Kulaks) కాక నిజమైన రైతులను సహితం నాశనంచేసిన రష్యానూ, యితర సోవియటు దేశాలనూ, రైతాంగమే లేని ఆస్ట్రేలియా దేశాన్ని మినహాయిస్తే - మిగిలిన యావత్తు ప్రపంచంలోనూ, వ్యవసాయం ఒక గొప్ప "చిన్నతరహా" పరిశ్రమగా కోటాను కోట్ల రైతులతో ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి ఎదురు నిల్చి, భయంకర పెట్టుబడిదారీ పోరాటాలను గతమూడున్నర శతాబ్దాలుగా ధిక్కరించి సంపాదుతూనేవున్నది. ఆర్థిక, రాజకీయ, సామ్రాజ్యవాదపు సత్తాసుకలిగిన, ద్రవ్యపుపెట్టుబడి అన్నింటిని జయించినప్పటికి, వ్యవసాయరంగం మాత్రం యిప్పటికీ దానిని ధిక్కరిస్తూనే వున్నది. విశాలమైన నిబ్రదొక్కుకునే శక్తి, త్యాగంచేసే సామర్థ్యము, విశ్వాసం, మాతృభూమియందు ప్రేమగల రైతుల యెదుట, విలాస భూయిష్టమైన, లాభదాయకమైన పెట్టుబడి దారీ విధానం, పరాజయం పొందింది. కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు మొదలైన వ్యవసాయరంగానికి చెందిన అనేక యితర వ్యాసంగాలన్నిటిని పెట్టుబడిదారీ విధానం ఆక్రమించి నాశనం చేసినప్పటికి

రైతాంగం యింకా తనకు మిగిలిన ముఖ్యమైన వ్యవసాయ భూములను విశ్వాసంతో అంటిపెట్టుకొని వున్నది. ఆధునిక ప్రపంచంయొక్క పిలుపునందుకుంటూ, దాని కవసరమైన ఉత్పత్తిజరుపుతూ, ఆహారపదార్థాల, వాణిజ్యపంటల ఉత్పత్తిని పెంచుతూ వ్యవసాయరంగంలో తమ ఆధిక్యతను ప్రదర్శిస్తూ అందులోనే తమ జీవనోపాధిని కల్పించుకుంటున్నారు. ఆ జీవనోపాధి ఎంత చాలీచాలనిదైనప్పటికీ, వృత్తిలో తన వుత్పాదనా శక్తికిగల అవకాశంవల్ల, బానిసత్వపు కూలిగాగాక స్వయం వృత్తితో జీవించగల స్వేచ్ఛవల్ల – ఆ జీవనోపాధే యెంతో మధురతరమౌతున్నది.

## రైతుల మనుగడనే సవాలుచేసిన శక్తిపై వారు విజయాన్ని ఎలాసాధించారు?

రైతాంగం వారియొక్క సాంఘిక, ఆర్థికవ్యవస్థలను ఒకముఖ్యమైన మార్గంలో సవరించుకోవలసివచ్చినది. ప్రాచీన కాలంలో వారికి సమష్టికుటుంబ కమతాలు, జాతి సామూహిక కమతాలు, సామాజిక ప్రాతిపదికపై కల్గిన వ్యవసాయ విధానాలుగావుండేవి. వారు వారి కుటుంబములో, తెగలో ఎందరు మగవారున్నారో అన్ని చిన్నకమతాలుగా చీల్చుకొని వ్యక్తిగతమైన స్వంత హక్కును ఏర్పరచుకున్నారు. ఇది ఒక గొప్ప త్యాగము. ఆనాడు బలహీనులు, అంగవిహీనులు, ముసలివారు మొదలగు పనిచేయలేనివారిని మిగత కుటుంబమంతా కనిపెట్టి

వారికనువైన పనులను మాత్రమే వారికి అప్పగించి పోషిస్తూ వచ్చారు. కాని ప్రస్తుతం వారిలో ప్రతిఒక్కరూ మోయ గల్గినంత, అన్నివిధాలైన పనులను యితరుల సహాయము లేకుండా చేసుకొనవలసివచ్చింది. పెట్టుబడిదారులనుండి వచ్చే సవాలునందుకోడానికి ప్రాచీన విధానంలోవున్న తక్కువ ఉత్పత్తి పద్ధతి నధిగమించి అధికోత్పత్తిని సాధించుకోడానికి యీ విధమైన విభిన్న సాంఘిక మార్గాలవైపు చీలిక అనివార్య మైంది.

ప్రాచీనకాలంలో ఎటువంటి ఆర్థికకుమారాన్నుండి కూడా హామీ నివ్వగల స్వయంపోషక ఆహారవిధానాన్ని పటిష్ఠంచేయుగల అన్నిరకాల ఆహారపంటలను ప్రతివారూ పండించుకొంటూ వుండేవారు. కాని తర్వాత పెట్టుబడిదారులు చూపుతున్న డబ్బు ఆశలవల్ల వ్యాపారపంటలను, ఒకేపంటగా-దానికోసమే తన నిపుణతయావత్తూ వెచ్చించి అధికంగా పండించి, హెచ్చుడబ్బు సంపాదించారు. కాని ఇటీవల (1929-33) ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు, వారనుభవించిన బాధలవల్ల ఆ విధానంలోనున్న హ్రస్వదృష్టిని ఎక్కువమంది రైతులు గమనించారు.

అనాదిగా పారంపర్యంగా వస్తూవున్న ఒకే చోటును అంటిపెట్టుకొనివుండే విధానాన్ని అధిగమించి రైతాంగం దేశంలో ఒకప్రాంతంనుండి మరొక ప్రాంతానికే కాక ఒక దేశాన్నుండి మరొక దేశానికి కూడా వ్యవసాయం కొరకు వలసపోయే విధానాన్ని అలవరచుకున్నది. గడచిన శతాబ్దం

మొత్తంమీద పరిశీలించినట్లైతే ఖండాంతరమైన వలసలు భారీగా జరిగినట్లు కన్పిస్తున్నది. 19 మిలియన్ల రైతులు, కూలీలు ఐరోపానుండి యితర ప్రాంతాలకు వలస వెళ్ళడమే యీ పరిస్థితిని ఋజువు చేస్తున్నది. జాతితత్త్వవాదులు, తామే వుండాలి అనుకునే సనాతన సామ్రాజ్యవాదులు యింకా అమెరికన్లు గత యేబది సంవత్సరాలనుండి రైతువలసలపై ఆంక్షలను విధించారు. ఐరోపానుండి వలసవచ్చిన రైతులవల్ల ఎంతో లాభాన్ని పొందియుండి కూడా ఆస్ట్రేలియా, కెనడా, యు. యస్. ఎ., దక్షిణ ఆఫ్రికా, కీన్యాదీవులు మొదలగు దేశాలు ఎంతోసారవంతమైన సాగులేని భూమిని గలిగియుండి కూడా ఐరోపానుండి యింకావచ్చే వలసదారులను కొన్ని షరతులతో మాత్రమే రానిస్తున్నారు. వాస్తవానికి ఆసియా నుండి పెద్దగావచ్చే వలసలను పూర్తిగా నిషేధించారు. స్టీఫెన్ లీకాక్ "మనబ్రిటీషు సామ్రాజ్యము" ("Our British Empire" - Chapter IV) అనే గ్రంథంలో వ్రాసినదాన్ని బట్టి యీ దేశాలు కూడా ఐరోపావారిని, అందులో ప్రత్యేకంగా నార్మన్, స్కాండినేవియా జాతులను ఆహ్వానించినందువలన వచ్చేలాభాలను యిప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని తెలుస్తున్నది. ప్రపంచంలోని వ్యావసాయిక ప్రాంతాల ఎల్లెడలా ఎక్కువ భూమిలో తక్కువపంటనిచ్చే విధానాన్నుండి, తక్కువ భూమిలో ఎక్కువపంటనిచ్చే విధానానికి, ఒకేపంట విధానం నుండి వివిధరకాలైన పంటలు వేసేపద్ధతికి పరస్పరం మారుతూ తక్కువ ఆదాయాలువచ్చే ఆటవిక వ్యవసాయ విధానాన్నుండి

ఎక్కువ ఆదాయాలనిచ్చే ఆధునిక వ్యవసాయ పద్ధతులకు ఎక్కువమంది కూలీలకు వృపాధిని కల్పించే వ్యవసాయ విధానాలకు వ్యవసాయ ఆర్థికరంగం బ్రహ్మాండమైన మార్పులు చెందుతూవచ్చింది. అధునాతన ప్రపంచ రైతాంగ పరిణామమేమంటే పశుసంపదను అభివృద్ధిచేస్తూ వాటి ఆహార అవసరాలకు ముతకధాన్యాలను వాడుతున్నారు. రైతాంగం వారి బలాన్ని, తెలివిని; సర్దుబాటుతనాన్ని ప్రదర్శిస్తూ అనేక విధాలుగా ఉత్పత్తులను పెంచుతూ, పారిశ్రామిక, వ్యాపార వర్గాల యొక్క పెరుగుతున్న అవసరాలను వారి విధానాలకనుగుణంగా తీర్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ విధంగా వారు పెట్టుబడిదారీ విధానం తమమీదకు వచ్చే మార్గాల్ని నిరోధిస్తున్నారు.

గత ఆర్థిక మాంద్యం ఏర్పడిన రోజుల్లో రైతాంగం తన నిలదొక్కుకునే శక్తిని ప్రదర్శించింది. ధరలు పడిపోయి వారి మనుగడకే దెబ్బయేర్పడినప్పుడు వారియొక్క వ్యావసాయిక సరంజామానంతా తగ్గించుకొని, డబ్బుకోసమై పండించే పంటలన్నింటినీ తగ్గించుకొని, కేవలం జీవనభృతికవసరమైన వ్యవసాయము మాత్రమే చేసుకొని అంతటి అధ్వాన్నమైన కటువులోగూడా నిలబడగలిగినారు. ఐరోపానుండి వలసపోవాలనుకొనేవారిను ద్దేశించి హెచ్చరికచేస్తూ స్టీఫెన్ లీకాక్ "మనం ఆహారాన్ని అమ్ముకోలేకపోయినయెడల మనమే తిందాం; మనం చేపలను అమ్ముకొనలేకపోతే మనమే వండుకుందాం; మనం కలపను ఎగుమతి చేయలేకపోతే మనమే ఇళ్లు కట్టు

కుందాం; వాటిలో కూర్చుందాం" అంటాడు. ఆ ఆర్థిక మాంద్యపు రోజులలో రైతాంగంకూడ లీకాక్ చెప్పిన దానికి ఉదాహరణా అన్నట్లు వర్తించింది. అయితే యీ విధమైన స్వయంపోషకత్వములో కొన్ని బాధలున్నవి. ప్రత్యేకంగా యింతవరకు ఒకేరకమైన వాణిజ్యపంట పండించడంపై కేంద్రీకరించిన వారి పరిస్థితి చెప్పనలవికాదు. కాని రైతాంగం యొక్క విజయంలోనున్న కొంత రహస్యము పై విధానములోనే వున్నదన్న విషయము, అమెరికాలోని బస్తీ నిరుద్యోగులు అసంఖ్యాకంగా పల్లెప్రాంతాలకు వెళ్ళి కనీసపు జీవనభృతికవసరమైన వ్యవసాయము చేసుకొని జీవించడంద్వారా ఋజువైనది. స్టీఫెన్ లీకాక్ "అవర్ బ్రిటిష్ ఎంపైర్" (Our British Empire P 237 - 39) గ్రంథములో చెప్పినట్లుగా "ప్రపంచం మొత్తముమీద అన్ని కాలాలలోను పరిశీలించినట్లయితే, భూమిలోపల, భూమిమీద మాత్రమే నిలబడి, భూమినిమాత్రమే నమ్ముకొని దేశాలు బ్రతుకుతవి."

పెట్టుబడిదారులుకూడా లాభాలుగడించుకొనుటలోను, వారిపద్ధతులను, వనరులను వినియోగించుకొనుటలోను, అసలు జరుపుకొనుటలోను తీసిపోయినవారు కారు. నిజానికి మనం యింతకుముందే గమనించినట్లుగా అనేక మార్గాలలో పెద్ద పెద్ద భారీతోటలను దక్షిణ అమెరికా రాష్ట్రాలతోసహా ఎన్నో వలసప్రాంతాలలో ప్రారంభించినారు. సామ్రాజ్యవాదపు ప్రభుత్వాల స్థానిక ప్రతినిధులమద్ధతుతో కిరాయిగాను, ఒత్తిడి

ద్వారాను వచ్చిన కూలీలసహాయముతో మలయా, ఇండో చైనా, సిలోనులలో రబ్బరు, టీ, కాఫీ, కోకో, చెఱకు, బనానా మొదలగు తోటలను పెద్దమొత్తాలలో పెట్టుబడిదారులు నడపడం ప్రారంభించారు. కాని వారికి వ్యవసాయానికి సంబంధించిన పరిశ్రమలలోను, వ్యాపారములలోను పెట్టుబడులు పెట్టి లాభాలుగడించినట్లుగా, యీ తోటలలో పెట్టిన పెట్టుబడిపై ఏదో కొద్దిచోట్ల మినహా లాభాలు రావడం లేదని గమనించారు. ఆ బానిసత్వకూలీలు, పాక్షిక బానిసత్వకూలీలు, వత్తిడిపై పనిచేసే కూలీలు, కిరాయి కూలీలు, స్వేచ్ఛా స్వాతంత్ర్య ప్రియులైన రైతుల సామర్థ్యంలో సగంపంతు సామర్థ్యంతో కూడా పని చేయలేరన్న సత్యాన్ని యీ పెట్టుబడిదారులు గమనించారు. అందువలన వారు ముడిపదార్థాల ఉత్పత్తి రైతులకే వదలివేయడం ఉత్తమోత్తమమైన మార్గంగా భావించారు. కనుకనే ఐరోపా భూస్వాములు అస్సాం, మలయా, కీన్యా, పశ్చిమ ఆఫ్రికా, పశ్చిమ ఇండియా దీవులలోని నివాసులను, తోటలలో పనిచేసే కూలీలను, రైత్వారీకమతాలుగా కౌలుకుతీసుకొని యీ తోటల భూములలో వ్యాపార పంటలను పండించవలసినదిగా కోరుతూ ప్రోత్సాహపరిచారు. అందువలన మొత్తముమీద భారీతోటల పద్ధతి వ్యవసాయము ఇరవైయవ శతాబ్దములో పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు, కావాలని యిచ్చిన ప్రోద్బలముతోకూడ చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించలేకపోయింది. ("History of South East Asia" by Prof. D. G. E. Hall).

పరిశ్రమలలో, వ్యాపారాలలోకంటె వ్యవసాయరంగంలో ఎక్కువ మొత్తాలలో పెట్టుబడి పెట్టవలసి వస్తుంది. కాని వాటిలో వచ్చే లాభాలలో సగంకూడా రావు. పరిశ్రమలవలె, వ్యాపారసంస్థలవలె కాకుండ వ్యవసాయంలో పెట్టుబడి ఎక్కువ మొత్తాలలో ఎక్కువకాలం నిలువ వుంచవలసివస్తుంది. అంతేగాక వ్యాపారాలలో, పరిశ్రమలలో పెట్టిన పెట్టుబడిని అవసరమైనప్పుడు తేలికగా మారకము చేసికొనవచ్చును. పెట్టుబడిదారులు వారి అవసరాల కనుగుణంగా వెంటనే ధన రూపములోనికి మార్చుకొన వచ్చును. కాని వ్యవసాయ రంగంలో పెట్టిన పెట్టుబడి అవసరమైనపుడు అంత సులభముగా వెంటనే తిరిగి లభించదు ఆధునిక పెట్టుబడిదారీ విధానములో పెట్టుబడి వ్యవసాయేతర కార్యక్రమములలో అనగా పారిశ్రామిక వ్యాపారరంగములలో ఎక్కువసార్లు తిరుగుచు ఎక్కువ సాంవత్సరిక లాభాలను గడించుతూ వుంటుంది. సహజంగా పెట్టుబడిదారులు వారి అదృష్టాన్ని వ్యవసాయంలో పరీక్షించుకొనడానికి వెనుకంజ వేస్తారు. ఇంకా చెప్పాలంటే, తేలికగా, ఖచ్చితంగా, చేతికందుబాటులో చక్రభ్రమణంలాగా లాభాలను గడించే విధానాలను అనుసరించే పెట్టుబడిదారులు, కానరాని ఋతువుల మార్పులతో, ప్రకృతి వైపరీత్యములతో, మానవాతీతమైన లెక్కలేని నష్టాలతో కూడిన వ్యవసాయాన్ని కోరుకొనరు.

వ్యవసాయోత్పత్తికి ప్రత్యేక బాధ్యత వహిస్తూ అవసరపు ఖర్చులు భరించి, కష్టాలను భరించి ఆపదలలో

యిరుకోక్కవలసిన అవసరం పెట్టుబడిదారులకేమున్నది ? పెట్టుబడిదారీ విధానం తన కీలక పరిశ్రమలద్వారాను, దోపిడీ వర్తక వ్యాపారంద్వారాను వీలయినన్ని మార్గాలద్వారా అధిక లాభాలను గడించుకొంటూ రైతాంగాన్ని మానవత్వంలేని అతితక్కువ జీవనస్థాయికి చాలీచాలని ఆదాయాలతో తృప్తి చెందే విధంగా తయారుచేసింది. ఈ విధంగా 1950 వ సంవత్సరం వరకు పెట్టుబడిదారీ మన స్తత్వంగల ప్రభుత్వాల మద్దతుతో రైతాంగ జీవనభృతిని ఎదురులేకుండా దోపిడీ చేస్తూ వచ్చింది. వారి పారిశ్రామికోత్పత్తులను, వాటి అధిక ధరలను, వ్యాపారాలను రైతులు ఆమోదించారు. రైతాంగం తమ స్వంత కమతాలలో, స్వతంత్రంగా స్వేచ్ఛగా బ్రతుకగల స్థితిలో యెంతో కష్టజీవులని నిరూపించుకున్నప్పటికీ - పెట్టుబడిదారుల భారీ తోటలలో ఒత్తిడిని, బానిసకూలీ విధానాన్ని సహించరన్నది స్పష్టమైపోయింది. కనుక ఉత్పత్తి ఫలితాల గ్యారంటీ లేని భారీ తోటలలో పెట్టుబడిపెట్టి రైతులచేత ఒత్తిడితో పనిచేయించుకొనే సాహసానికి పెట్టుబడిదారులు ఎందుకు మొగ్గుతారు ? అదేవిధంగా రష్యాలో నలభై సంవత్సరాలుగా రైతాంగాన్ని అణచివేయాలని జరిపిన ప్రయత్నం, దానిని యెదిరించి రైతాంగం జరిపిన పోరాటం, తత్ఫలితంగా రష్యా ఆర్థికవిధానానికేర్పడిన ఘోరవిపత్తు, పెట్టుబడిదారులకు ఒక హెచ్చరికగా పనిచేసినవి. క్లుప్తంగా చెప్పాలంటే వ్యవసాయరంగం తన ఉత్పత్తి బాధ్యతలను తానే స్వీకరించడంవల్ల పెట్టుబడిదారీ విధానానికి అనవసరపు చాకిరి తగ్గిపోయింది.

వ్యావసాయరంగపు బాధ్యతలను స్వీకరించడంలో తనఅసమర్థతను గుర్తించిన పెట్టుబడిదారీవిధానం తనకు అవసరంలేనప్పటికి తను యిప్పటివరకు జరిపిన పోరాటానికి సిగ్గుపడింది.

మరొకవైపున, రైతాంగం దుఃఖభాజనమైన తక్కువ జీవనస్థాయిగలిగిన తన జీవన విధానములో ఎందుకు తృప్తి చెందుతూవుంది ? వారు ఎక్కువ సంఖ్యలో యితర దేశాలకు వలసవెళ్ళే ప్రయత్నంలో వున్నమాట నిజమే. అయినా ప్రపంచంలోని అన్ని దేశాల జనాభా లెఖ్ఖలను పరిశీలించి చూచినట్లయితే యీ వ్యావసాయిక జనులు మాత్రమే స్థిర నివాసులుగా కన్పిస్తారు. కొందరు మాత్రం "ఆకలిగొన్న మానవులు ఏ కూలీతోనైన పనిచేయడానికి అంగీకరిస్తారు" అన్న విధంగా, పట్టణాలకు, పరిశ్రమలలో పని జేయడానికి తరలివెళ్ళారు. (U. S. Conference on Economic Progress 1955). పట్టణ, పారిశ్రామిక, వాణిజ్య వర్గాలతో పోల్చిచూస్తే రైతాంగపు జీవనవాంఛ తగ్గు ధోరణిలో లేనట్లు కన్పిస్తుంది. వారిలో అధికజనన సంఖ్యకూ, శారీరక మానసిక బలిష్ఠతకూ యిందుకై అభినందనలు తెల్పుకోవలసి వుంది. కాని యిందులోని రహస్యం ఏమిటి ?

గ్రామీణ వాతావరణపు ప్రభావం, భూమిపట్ల అనుబంధపు ప్రభావం; ప్రజల ఆరోగ్యంపై, నైతికస్థాయిపై హెచ్చుపలుకుబడి చూపిస్తున్నవని సాంఘిక, వైద్యశాస్త్రజ్ఞులు యిప్పుడిప్పుడే ఒక అభిప్రాయానికి వస్తున్నారు. బస్తీమోజులో

డబ్బుతో కలిగే తృప్తికన్నా భూమిపైగల మక్కువ రైతుకు ఎక్కువ సంతృప్తిని కలిగిస్తుంది. కనుక రైతులు వారి వారి స్వంతభూములలో పనిచేసుకొనే హక్కంటే, ఎంతటి తక్కువ ఆదాయాలతోనైనా, మరింతతక్కువ ఆనందాలతోనైనా, కనీస అవసరాలతోనైనా తృప్తిపడి జీవితాన్ని సాగించగలరు. అందువల్ల మధ్యధరా ఆఫ్రికానుండి జపాను వరకుగల యీ సనాతనకార్మికుడు తన తాత తండ్రులనుండి తనకు సంక్రమించిన భూములను నిలుపుకొనుచు, వీలయితే యింకా కొంతభూమిని సంపాదిస్తూ తమ స్వగ్రామములో లేక తమ స్వంత జిల్లాలో తమ బిడ్డలు అప్పులు లేకుండా స్వంత కమతాలతో - ఎంత చిన్నదైనా - జీవితాన్ని ప్రారంభించాలన్న ముఖ్య ఆశయముతో బ్రతుకుతూవుంటాడు. తరతరాలుగా భారతీయరైతులు పట్టణాలకు, యింకా బ్రిటీషు సామ్రాజ్యములోని యితర ప్రాంతాలకు తరలివెళ్ళి, వారియొక్క ఎముకలగూడుతో కష్టించి పనిచేస్తున్నారంటే, అది ఆ క్రొత్త నివాసాలలో శాశ్వతముగా వుండాలని కాకుండా స్వదేశములో, స్వగ్రామాలకు తిరిగివచ్చి తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యయుతమైన రైతాంగ కుటుంబాలను, గృహాలను బాగుపరచుకోవాలనే ఆశయంతోనే. అద్వితీయమైన యీ ఆశయం గ్రామీణ జీవితముమీద, భూమిమీదగల ప్రేమ, కృంగి కృశిస్తున్న అనేకకోట్ల ఆఫ్రికా రైతాంగ హృదయాలలో జీవన వెలుగులను ప్రకాశింపజేస్తూ వచ్చింది. దానియెదుట పెట్టుబడిదారీ విధానం అపజయంతో తలవంచవలసిందే.

ప్రపంచ రైతాంగ చరిత్ర మొత్తంలో, తమకన్న బలమైన తుఫాను మీదకువచ్చినపుడు తలనువంచినప్పటికి, వ్రేళ్ళను గట్టిగా అంటిపెట్టుకొని వుండే ఉపాయం మాత్రం ప్రదర్శితమౌతూ వచ్చింది. రాచరికాల నియంతృత్వాన్ని కాని, గ్రామాలలోని ఆటవికజాతి నాయకులుపెట్టే బాధలను గాని, చుట్టుప్రక్కలవున్న దోపిడీజాతుల దండయాత్రలను గాని, ఎదుర్కొనడంలో రైతాంగం వీరోచితమైన పోరాటాన్ని సల్పింది. ( See the author's "Revolutionary peasant"). అయితే వాళ్ళు అపజయాన్ని పొందినపుడు గూడ, సహింపరాని, కఠినమైన ఆజ్ఞలకు కావలసినంతవరకు తలవంచుతూ సమయానుకూలంగా భూమితో సంబంధమును కాపాడుకున్నారు. కొంతమంది హ్రస్వదృష్టిగల చరిత్రకారు లకు, యిన్ని కష్టాలకు ఓర్చి భూమి ఎడల, గ్రామీణ జీవితము ఎడల వారు చూపించే విశ్వాసం కపటమైనదిగా కన్పించ వచ్చును. కాని మానవ చరిత్రలోనికి లోతుగా చూచి పరిశీ లించినట్లైతే, యిది చాలా తెలివిగల నమ్మకమైన జీవితాశ యంగా, జాతికీ నాగరికతకూ చిహ్నంగా కన్పిస్తుంది. దాదాపు జీవితాశనే వదలివేశాయనుకున్న రెడ్ ఇండియన్లు, ఆస్ట్రేలి యన్లు, ఫిలిపైన్లు, ఫిజియన్లు వంటి కొన్ని బలహీనమైన తెగల విషయం ప్రత్యేకం పరిశీలిస్తే యిందులోని సత్యం విదిత మౌతుంది.

నియంతలు, ఫ్యూడల్ పెద్దలు, వారి రాజ్యాంగ పద్ధ తులద్వారా, ఆదిమ ఆటవికజాతి నాయకుల నియంతృత్వాన్ని

ఓడించారు. ప్రాచీన ప్రజాస్వామ్యాలు నియంతలచేత ఓడింప బడినప్పుడుగానీ, తర్వాత రాజుల చక్రవర్తుల చేతులలో పడినప్పుడుగానీ, ఆవిధంగా దోపిడీవర్గాలు ఎల్లెడలా రాజ్యమేలి నప్పుడుగానీ, రైతులు వాళ్ళభూములను అంటిపెట్టుకొనే వున్నారు. అదేవిధంగా బానిసలుగా, కూలీలుగా, అంటరాని వారుగా చూడబడిననాడుకూడ అలానే అంటిపెట్టుకొని అవ కాశంకోసం ఎదురుచూస్తూ వున్నారు. ఈ రైతాంగం ఎప్పుడైనా యజమానుల్లాగు చలాయిస్తున్న యీ దోపిడిదారు లను కూలద్రోయడానికి ఏ కొద్దిపాటి అవకాశం లభించినా జారవిడుచుకోలేదు. ఐరోపాలో చర్చికి, ప్రొటెస్టేంట్లకు మధ్య జరిగిన సంఘర్షణలలో, ఫ్రెంచి రష్యా విప్లవాలలో, రైతులు బయటపడి పోరాడి ఎంతో కొంత విజయాన్ని సాధిస్తూ వచ్చారు. కనుక ఏనాడూ రైతాంగం శాశ్వతంగా అణగారి వుండడానికి ఒప్పుకోలేదు. పాలకవర్గాలవారు రైతాంగాన్ని పునాదిరాళ్ళుగా వాడుకొని కట్టినకట్టడాలు - రైతాంగం సాగించిన భీషణ సంఘర్షణలలో బీటలువారి పడిపోక తప్ప లేదు. అలాపడిపోతాయనే ఆశయంతోనే రైతాంగం ఎల్ల ప్పుడూ జీవిస్తూవచ్చింది. రెండవ ప్రపంచయుద్ధంలో చైనా రైతాంగపు చిరస్మరణీయమైన వీరోచిత పోరాటం, అంతులేని శక్తిగల జపాను సామ్రాజ్యవాదుల్ని సైతం ఆరుసంవత్సరాలు నిరాఘాటంగా ఎదుర్కొనగలిగిందంటే వారికి భూమిపట్ల గల ప్రేమ అజరామరమైనది కావటమే కారణం. పెరల్ బక్ "డ్రేగన్ సీడ్" (Dragoon Seed) అనే తన నవలలో వారి

ఆత్మస్థైర్యాన్ని గూర్చి చాలా చక్కగా వ్రాసింది. ఆ నవల లోని కథానాయకుడు లింగిటాన్ తన కుమారునికి వ్రాసిన జాబులో "నేను చనిపోయాక నా కుమారుడు, నా మనుమడు శత్రువు దేశాన్ని వదలి వెళ్ళేవరకూ భూమిని అంటిపెట్టుకొని వుండవలసిందే" అంటాడు. (P-811). ఈ విధంగా రైతాంగం ఏవిధమైన ఆశాకిరణము లేనిరోజుల్లో కూడా భూమిని అంటిపెట్టుకొనియుండి చివరకు శత్రువును ఓడించ గలిగింది. లింగ్‌టాన్ రెండవ కుమారునితో అతని భార్య, "విదేశీయుల ఆక్రమణ ప్రాంతంలో మనమిలా యీ భూమిని పట్టుకొని వ్రేళ్ళాడడం ప్రతిష్ఠాకరంగా లేదని అన్నపుడు అతడామెతో- "ఇది మనం నిలబడేదానికి జరిపే పోరాట "పద్ధతి" అని చెబుతూ-"ఏదో ఒకరోజున దీనికికూడా ప్రతిష్ఠ వస్తుంది" అంటాడు. "భూమి మన చేతిలో వున్ననాడు ప్రతిష్ఠ లేకపోతే మాత్రం ఏమి?" అని ప్రశ్నిస్తాడు. ఎంతటి అందమైన వీరోచితమైన భావన! ఆఖరున ఎంతటి అద్భుత అంతిమ విజయం!!

లిన్‌యూటాంగ్ అనువదించిన చైనీయుల గెరిల్లాపాటలో- "మనమంతా యీ భూమిమీద పుట్టిపెరిగాం. ఈ భూమిలో ప్రతి అంగుళం మనది. దీని నెవ్వరైనా మననుండి కాజేయాలని ప్రయత్నిస్తే చివరివరకూ పోరాడుతాం". అంటాడు. పట్టణాల్లోని దేశభక్తులలోను, గ్రామీణ రైతాంగంలోను, వున్న వీరోచిత పటిమ అటువంటిది.

ఈ ఆధునిక కాపిటలిజం, సోవియటిజంల ప్రభావం రైతులపైకూడ పడకుండా పోలేదు. ప్రతిచోట యుపశక్తితోవున్న యీ పెట్టుబడిదారి విధానం, సోవియట్ విధానం, రైతాంగానికి అలవిగానంత బలమైన శత్రువులుగా తయారైనవి. కనుక రైతాంగం యీ సరిక్రొత్త తుఫానుముందు తలవంచక తప్పలేదు. దురదృష్ట మేమంటే నీచమైన ఫ్యూడలిస్టుల చేతుల్లోనుండి బయటపడి రైతాంగం ఆర్థికంగా, సాంఘికంగా స్వేచ్ఛావాయువులను పీల్చే ఆశలతో వుండగా, కొన్నిచోట్ల దొంగతనంగా, కొన్నిచోట్ల నిదానంగా, కొన్నిచోట్ల తుఫానులాగా, మరికొన్నిచోట్ల అకస్మాత్తుగా యీ క్రొత్తరకపు దోపిడీ వర్గాలైన పెట్టుబడిదారీ విధానం, సోవియటిజం వారిని దురాక్రమణచేసినవి. ఈ రెండు దోపిడీ వర్గాలు వెనుకటి రాజులకన్నా, నియంతలకన్నా, ఫ్యూడలిస్టులకన్నా బలము, తెలివి, మార్గముల గలిగి నటువంటివి. ఇవి చట్టవిరుద్ధమయిన అన్నిదోపిడీ వర్గాలను ఆశీర్వాదిస్తూ వాటివాటి దోపిడీమార్గాలలో సహాయము పడుతువుంటవి. మళ్ళీ యీ పెట్టుబడిదారీ విధానం, సోవియటిజం తన క్రొత్త యజమానులుగా తయారవుతుండగా రైతాంగం మళ్ళీ వారి ఎత్తుగడప్రకారం అణగివుండి క్రొత్తపరిస్థితులకు అనుగుణంగా కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నట్లుగా కన్పిస్తూ, వాళ్ళవాళ్ళ భూములను మాత్రం కనిపెట్టి అంటిపెట్టుకొని వుంటూ వచ్చారు.

కాంగ్రెసుపార్టీ అధికారములోవున్న భారత ప్రభుత్వం, రైతాంగంయొక్క ముప్పది సంవత్సరాల ఆందోళన ఫలితంగా

చివరకు రైతులను - వర్తకవ్యాపారస్థులనుండి, వాణిజ్యవర్గం నుండి, పారిశ్రామికులనుండి రక్షించేందుకై ముందుకువచ్చి "సెంట్రల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంటు అండ్ వేర్ హౌసింగ్ బోర్డు"ను స్థాపించింది. దీనిక్రింద రాష్ట్రస్థాయిలో బోర్డులు వుంటవి. దీని వుద్దేశ్యము "అంచనాలువేసి, ఉత్పత్తులను పెంచుటకై పరిశ్రమలను, వ్యాపారమును, నిల్వలను సరి చూచుట, వ్యవసాయోత్పత్తులను సహకార సంఘాలద్వారా ఎగుమతి, దిగుమతుల చేయుట." దీనికి కావలసిన ధనము యావత్తు కేంద్రప్రభుత్వం పెట్టుబడి పెడుతుంది. ఒక "కేంద్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్" వుంటుంది. దీని ముఖ్యోద్దే శ్యము భారతదేశ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసేందుకై ముఖ్యమైన ప్రాంతాలలో గోదాములను నిర్మించి నిల్వచేసి, రవాణా సౌకర్యములు కలుగచేయుట. కావున ఒక పెద్ద విప్లవాత్మకమైన విధానానికి ప్రారంభం చేయబడింది. ఇదంతా చైతన్యయుతమైన రైతాంగం వత్తిడిద్వారా పెట్టు బడిదారీ విషవలయాన్ని ఛేదించి సాధించిన ఘనవిజయమే. రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రకారం కేంద్ర కార్పొరేషన్ 100 గోడౌనులు, స్టేట్‌బోర్డులు 250 గోడౌనులు మొత్తం ఇరవై, ఇరవై అయిదులక్షల టన్నుల ధాన్యాన్ని నిల్వచేసే స్తోమతుగల గోడౌన్లను కట్టించే ఆలోచనలోవున్నారు. రైతులను వుత్సాహపరచి పెట్టుబడిదారి సంకెళ్ళనుండి రైతు లను కాపాడే యిట్టి రక్షణచర్యలను గైకొనుట మిగతా

ఆసియా, ఆఫ్రికా, వెనుకబడిన దేశాలకు యిది ఉత్తేజకారి కాగలదని ఆశిద్దాం.

ఆఫ్రికన్ అటవికజాతి విధానం, యూరోపియన్ భారీ తోటల యజమానుల ఎక్కువకూలి మొదలగు మెరమెచ్చులకు మోసపోక, ఎదిరించి వెట్టిబడిదాసులతో పోరాడి చాలావరకు విజయాన్ని సాధించింది. ఈ ఆఫ్రికా వాసులను వారి స్వయం పోషక ఆర్థికవిధానానికి, సాంఘికనాయకత్వానికి, వారి వారి తెగలలో సాంఘికసమానత్వము యెడల వారు చూపించే ప్రేమకు, బానిస కూలీవిధానాన్ని నిరసిస్తూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల యందువారికి గల ప్రేమను నిజంగా వాళ్ళను అభినందించాలి. యూరోపియన్లు వారికిగల రాజకీయ ఆర్థిక అధికారాలతో అన్యాయంగా అధికపన్నులను విధించి, ఎక్కువకూలీ, త్రాగుడు మొదలగు బస్తీ మెరమెచ్చులను ఆశచూపించి ఆఫ్రికా వాసులను బానిసత్వపు కూలీవిధానంలోకి లాగవలెనని ప్రయత్నంచేశారు. కాని ఆ దైర్యాంగపు సాంఘిక నైతిక కట్టుబాట్ల యెదుట యూరోపియన్లు చిత్తుగా విఫలమయ్యారు. భారీతోటలపై విపరీతమైన లాభాలు గడించాలనే యూరోపియన్ల ఆశకొనసాగలేదు. సమర్థవంతమైన, క్రూరమైన యూరోపియన్ల (బెల్జియం, ఫ్రెంచి) అణచివేత పద్ధతులు గాని, ముట్టడులు గాని, కూలీలుగాని, వారు ప్రవేశపెట్టిన పాశ్చాత్య సాంఘిక దురాచారాలుగాని నీగ్రోలను బానిసకూలీలుగా, భారీతోటలలో పనిచేయించలేక పోయినవి.

కావున రైతాంగ ఉద్యమం యీ భారీతోటల యజమానులపై చాలవరకు విజయాన్ని సాధించగలిగింది. ఈ రైతాంగం స్వంత భూముల యుండైతే ఎంతటి కష్టనష్టాల కోర్చి అయినా, ఆహారపదార్థాలనుగాని, వ్యాపారపంటలనుగాని పెట్టుబడిదారుల అవసరాలనుమించి మిన్నుమిక్కిలిగా పండిస్తున్నారు. ఈ రైతాంగం తమకు, పశువులకు చాలినంత తిండి దొరకనప్పటికి క్రితంలోని సాంఘిక ఆనందాలను మానుకొని, విశ్రాంతి విరామం వదలుకుని, జాతీయ సెలవు దినాలను పోగొట్టుకుని తమ తమ ప్రియ భూకమతాలను నిల్పుకునే ఏకైక ఆశయంకోసం, ఆ భూములపై స్వేచ్ఛాజీవులుగా, స్వయంవృత్తులవారుగా కృషి చేయగల భాగ్యంకోసం అనవరతం కష్టించి పనిచేస్తున్నారు,

అత్యంత శోచనీయమైన పరిస్థితి ఏమంటే 1920-36 సంవత్సరాలలో రష్యాలోని రైతాంగం కార్మికనియంతృత్వాన్ని ఎదుర్కొనడం; యీ కార్మిక నియంతృత్వం రైతాంగాన్ని వారి భూములను స్వతంత్రంగా సాగుచేసుకొనే స్వేచ్ఛలేకుండా చేయాలని ప్రయత్నించడం, జార్ ప్రభుత్వాన్ని ఏ స్వేచ్ఛకోసమైతే నవంబరు విప్లవంద్వారా ఓడించి తర్వాత ప్రతివిప్లవాన్ని తెచ్చి తద్వారా పెద్దభూస్వాములను కూడా రద్దుచేశారో, ఆ స్వేచ్ఛకే మళ్ళీ ప్రతీఘాతం ఏర్పడింది. రైతాంగం పోరాటంద్వారా పాక్షికవిజయాన్ని అంటే అర ఎకరంనుండి రెండు ఎకరాలవరకు ప్రతిరైతు స్వేచ్ఛగా కలిగి

వుండేదానికి స్టాలిన్‌ను ఒప్పించగలిగారు. ప్రభుత్వ వ్యవసాయ క్షేత్ర బానిసత్వంలో మగ్గేవారికి యీ కొద్ది విజయం ఏదో కొంత మేలు. దేశంలో అనేక ప్రాంతాలలో ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలను (Solkhoz) కూడా వదిలివేయ వలసిన అవసరం ఏర్పడింది. రష్యాలోని యీ వైఫల్యాన్ని గమనించి చైనాలోని కమ్యూనిస్టులు, రైతుల్ని భూములనుండి తొలగించి బానిసల్ని చేసే కార్యక్రమాన్ని సంశయంతో నెమ్మదిగా నిర్వహిస్తున్నారు.

రాయల్ కమిషను (1930) కూడా భారత గ్రామిక పద్ధతిని పరిశీలిస్తూ, భూమియందు రైతుకుగల మక్కువను గుర్తించారు. వారు "భారత తేయాకు పరిశ్రమలలోని కూలీలు వారి జీవనస్థాయి పెరుగుదలకంటె, వారి గౌరవ ప్రపత్తుల పెరుగుదలనే ఎక్కువగా వాంఛిస్తువుంటారు" అని వ్రాశారు. వారిలో సాంఘికస్థాయి స్వంత భూములుగల వారికే లభిస్తుంది. అందువల్ల "వారికి వారే యజమానులు" అవుతారు.

R. C. దత్తు, సర్ జాన్ లారెన్సును ఉదహరించినట్లుగా "వారిభూములయందు వారికిగల అమితమైన, గాఢమైన ప్రేమ"కు భారత రైతాంగంపై గొప్ప ప్రభావంగలదు. వేలు, లక్షల సంఖ్యలో ఉత్తరహిందూ దేశములోని ప్రజలు, "వారి భూములను కష్టపడి సంరక్షించుకోవాల"నే భావాన్ని వారి పూర్వీకులనుండి పొందారు. జిమోఫెర్రీగోరర్ అన్నట్లుగా

"ఆదిమ నీగ్రోవానికి అతని భూమి, పూర్వీకులు అతని ఏకతకు మూలకందాలు" (Africa Dances P 131).

మెక్సికో అధ్యక్షుడు కార్డినాజ్ అంటాడు - "భారతీయ జీవన విధానంయొక్క అర్థం స్వంతభూమిని కలిగియుండటం మీదనే ఆధారపడివుంది. భారతీయునికి జీవితమే భూమి" - "మెక్సికోలో నివసించేదానికి అవసరమైన వాతావరణమేమిటంటే భూమిని స్వంతంగా కలిగివుండటమే".

స్పెయిన్ రిపబ్లిక్ విదేశాంగమంత్రి జె. ఆల్వారాజ్ డెల్ వాయో, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ అనే వాటిపై స్పెయిన్ రైతులకు గల మక్కువ విషయంతో ప్రత్యక్షసాక్షి, ఫాసిస్టులకు ఓటుయిస్తే ఎంత సొమ్మయినా యిస్తామని ఆశచూపిస్తే ఆ రైతు "అయ్యా! నీకొక నమస్కారం. ఆకలితో చచ్చినా నాకు నేనే యజమానిని" అంటాడు (Freedom's Battle - P 180).

అమెరికా పట్టణాలలో, మహత్తరమైన సుఖాలను, అవకాశాలను అనుభవిస్తున్న ప్రజానీకంకూడా గ్రామీణ జీవనానికి అనుకూలంగా అరవై అయిదు శాతం ఓటుచేశారు. ఎందుకని ప్రశ్నిస్తే వారీవిధంగా సమాధానం చెప్పారు "దానికి అదే యజమాని. అది ప్రకృతికి దగ్గఱగా సంచరిస్తుంది. - చెట్లు పెరగడానికి, పశుసంపద అభివృద్ధిచెందడానికి అది దోహదంచేస్తుంది. ముసలితనంవచ్చి రిటైర్ అయినప్పుడు అది బ్రతుకుకు హామీనిస్తుంది." ఆ విధంగా జాన్ స్ట్రామ్ సంపాద

కత్వాన వెలువడిన 1955 ఫారం - రాంచ్ హోమ్ ఆల్మనాకలో చెప్పబడింది (1955, Farm - Ranch Home Almanac; Edited by John Strohm).

రైతాంగాన్ని లేకుండా చేయడం చాలా కష్టసమస్య అనే విషయం మార్క్సుకు తెలుసు. "వ్యక్తిగత శ్రమమీద ఆధారపడి చెల్లాచెదురుగావున్న ప్రైవేటు ఆస్థిని, పెట్టుబడి దారి ఆస్థిగా మార్చాలంటే చాలా దీర్ఘకాలికమైన పని అవుతుంది.

"పెట్టుబడిదారి ఆస్థిని, సామాజికమైన ఆస్థిగా మార్చే దానికన్నా చాలా కష్టమైన పని అవుతుంది. దౌర్జన్యచర్యలతో చేయవలసివుంటుంది "అని ఆయన అంటాడు. (Capital Vol II P 846 - 847). విపరీతమైన ఎక్కువ వడ్డీలతో రైతాంగానికి అప్పుగా యిచ్చిన పెట్టుబడి యితర విధంగా పెట్టిన పెట్టుబడిదారి విధానానికి తెలుసు. అందువల్ల అది తనయుక్తితో రైతాంగాన్ని నామకః తనకు గల్గిన స్వంత కమతాల హక్కు కోసం ఎంతైనా చెల్లించే విధంగా తయారు చేసింది. పెట్టుబడి దారి విధానానికి, తన స్వంత అజమాయిషీలో ఆశించగల దానికంటె హెచ్చు మొత్తాలను తన పారిశ్రామిక వలయం ద్వారా, అధిక ధరలద్వారా రైతాంగంనుండి గుంజవచ్చునని తెలుసు. అందువల్ల ఆ రెండువర్గాలుకూడా వ్యవసాయాన్ని "రైతులయొక్క అధికారం, యాజమాన్యం క్రిందనే" వదలి వేసే విధంగా ప్రవర్తించారు.

కాని యీ విధమైన కష్టసాధ్యమైన సామరస్యం ఎంత కాలం సాగుతుంది? రైతులు ఎంత కాలం యిలా పెట్టుబడిదారుల చేత పీల్చివేయబడడానికి ఒప్పుకుంటారు? రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వివిధ దేశాల రైతాంగ అనుభవం, బెంగాల్ ఒరిస్సా ఆకలిచావుల అనుభవం, యీ సామరస్యం విచ్ఛిన్నమయ్యే కాలం చేరువ అయిందా అని సూచించినవి.

గత ఆర్థిక మాంద్యంయొక్క పరిణామాల గురించి నిశితంగా పరిశీలించిన W. ఓటినస్కీ అభిప్రాయం కడువాస్తవమైనది.

"పరిశ్రమ కరువును ప్రారంభించడమే కాకుండా సర్వనాశనానికి కూడా కారణభూతమైంది. రైతుపై ఆ విధమైన ఆలోచన చేయడానికి అవకాశంలేదు. తన తాతతండ్రులకు చెందిన భూములలో మామూలుగానే పండిస్తూ, ఉత్పత్తి చేస్తూనేవున్నాడు. నిరుద్యోగియై, బస్తీలను వదలి పనికోసం, ఆహారంకోసం దేశమంతా తిరుగాడేవారిలాగా, సంఘబహిష్కారిలాగా కాకుండా, రైతు కావలసిన దానికంటె అతిగా, ఎప్పుడూ ఆలోచించలేదు. పారిశ్రామిక నిరుద్యోగిలా కాకుండా, నాశనమయ్యే పరిస్థితులు ఏర్పడినపుడు రైతు విప్లవచైతన్యంతో ఎదురు తిరిగాడు. ఈ కరువువలన పారిశ్రామిక కార్మికులలో భేదాభిప్రాయాలు ఉత్పన్నమై ఒకరిపై ఒకరు ఎదురుతిరిగి బలహీనంగా తయారయ్యారు. వ్యవసాయరంగంలో అలా కాకుండా, కరువు రైతుల్ని ఏకం చేసింది. కార్యక్రమాలకు బలాన్నిచ్చి అన్ని రాజకీయ ఆయుధాలను ఉపయోగించడం నేర్పింది. వారి భూము

లను తాకినప్పుడు, వారికి భూమియందుగల భక్తిని కించపరచా లని చూచినప్పుడు, వారి వృత్తి భగ్నమయ్యే పరిస్థితి వచ్చినప్పుడు, రైతులయందు అంతర్గతముగావున్న అంతులేని విప్లవశక్తి వాళ్ళను పెట్టుబడిదారీ విధానం మ్రింగివేయకుండా కాపాడింది. 1931 వ సంవత్సరంలో భారత రైతులు, వ్యావసాయిక అప్పులకు, శిస్తుబకాయిలకు మారిటోరియం ప్రకటించవలసినదిగా కోరినప్పుడు, ప్రథమ సమావేశంలో నేను అధ్యక్షుడుగావుండి యిచ్చిన ఉపన్యాసము, ఓటిన్‌స్కీ 1936 లో చెప్పినది ఒకేపద్ధతిలో నున్నవి.

1929-35 ఆర్థికమాంద్యము, రెండవ ప్రపంచయుద్ధము- ప్రపంచ పెట్టుబడిదారీ విధానం రైత్వారీ వ్యావసాయిక విధానంపై చేసిన పెద్ద దండయాత్రలు, ఆ రెండు సమయములలోకూడా, వారు త్వరితగతి నివారించుకుపోగలదన్న భావనను విరుద్ధంగా పెట్టుబడిదారీ విధానం వ్యవసాయాన్ని మ్రింగలేక పోయింది; రైతుని కించపరచలేకపోయింది. గత ఆర్థిక మాంద్యపు కాలంలో రైతులు వారి 'జీవనభృతి వ్యవసాయం' ద్వారా, తిరుగుబాట్లద్వారా వారి సంగతి వారు చూచుకొను సమర్థులు అని ఋజువుచేశారు. కమ్యూనిస్టు మానిఫెస్టోలో ఊహించినట్లు విరికితనంతో, సంస్కరణ పద్ధతిలో కాకుండా, తీవ్రమైన, నిర్మాణాత్మకమైన, విప్లవాత్మకమైన పద్ధతిలో యీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది అభివృద్ధి నిరోధకత్వం కాదు; అభ్యుదయకరం. రైత్వారీ వ్యావసాయిక విధానం

ముందు, భారీ పెట్టుబడిదారీ వ్యావసాయిక విధానం పరాజయం పొందింది. పెట్టుబడిదారి విధానం రైతులపై ఎట్టి విజయాలను సాధించే అవకాశంగాని శక్తిగాని యికలేదు. నానాటికి రైతులు బలపడుతున్నారు; స్వేచ్ఛను పొందుతున్నారు. పెట్టుబడిదారీ శక్తి చలామణి కాకుండా పోయిన తర్వాత పరిస్థితి ఏమిటి?

గడచిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నాటినుండి పెట్టుబడిదారీ విధానం, సోవియటిజం, రెండింటిపై ప్రపంచరైతాంగం చెప్పుకోతగిన విజయాలను సాధించింది. ఐరోపా దేశాలు, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మొదలగు దేశాలలో రైతులు తమరక్షణకొరకు అత్యవసరమైన, ప్రత్యేకమైన చర్యలను తీసుకొనమని వారిప్రభుత్వాలపైన వత్తిడి తెచ్చారు. పందొమ్మిదవ శతాబ్దపు బహుముఖమైన ప్రపంచ వాణిజ్యరంగంనుండి చాలా దేశాలు ఉపసంహరించుకున్నవి; ప్రపంచమార్కెట్లు బహిష్కరింపబడినవి. ప్రపంచమార్కెట్ల నుండి జాతీయ ఆర్థిక విధానాన్ని పరిరక్షించుకొనడం, వ్యావసాయక ధరల స్థిరీకరణ జరుపుకొనడం లక్షణాలుగాగల అమెరికా విధానాన్ని చాలాదేశాలు అనుసరించినవి. యుద్ధ ఫలితాలమీద యఫ్. ఎ. ఓ (F. A. O) దశాబ్ద పరిశీలన (1944-45), యీ క్రింది నిర్ణయాలను చేసింది :-

"ప్రభుత్వ సహకార మార్కెటింగ్ సంస్థలు నెలకొల్పబడినవి". "వ్యవసాయ స్వయం సమృద్ధి", "వ్యావసాయిక

ఉత్పత్తుల ప్రపంచ వ్యాపార నిలుపుదల" వైపు గొప్ప మొగ్గు కనబడుతున్నది. దీనిఫలితమేమంటే అమెరికా, ఆస్ట్రేలియాలతో సహా అన్ని పశ్చిమ దేశాలలోను, ఆసియాలోని ప్రధానమైన దేశాలలోను రైతాంగం అంతర్జాతీయ వ్యాపారం, ప్రపంచ మార్కెట్లయొక్క కీడునుండి భద్రతను పొందినవి. ఆవిధంగా రైతాంగంముందు పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేయడం ప్రారంభించింది.

ప్రపంచంలోని సోవియట్ భాగంలో రైతులు చాలా మహత్తరమైన విజయాన్ని సాధించుకున్నారు.

ప్రపంచయుద్ధం తరువాత ఆగ్నేయ ఐరోపా దేశాలలో చైతన్యవంతమైన రైతాంగం నాజీ, ఫ్యూడలిస్టు శక్తులమీద విజయాన్ని సాధించుకొని వారి రాజ్యాలమీద పటిష్టమైన రాజకీయ అధికారాన్ని పెంపొందించుకున్నారు. అందుకు చక్కగా పెరిగిన రైతు పార్టీలను ఇంకా వారి నాయకత్వాన్ని అభినందించాలి. కాని దురదృష్టకరమైన పరిణామమేమిటంటే 'విమోచన సైన్యాలు' అని చెప్పబడుతున్న సోవియట్ ఎర్ర సైన్యాలు ఆ రాజ్యాలలో ప్రవేశించి, వారి పార్టీలను ముక్కలు చేసి, వారిని బలహీనపరచి రైతుప్రభుత్వాలను పడగొట్టారు. మాస్కో చే పోదగబడిన కమ్యూనిస్టు పార్టీలను కొరముట్లుగా అడ్డము పెట్టుకొని ఆయా దేశాల కర్షక నాయకులను హత్య చేశారు, జైళ్ళలో క్రుక్కారు. ఇంకా దేశాంతరగతులను చేశారు. ఆవిధంగా ఆయా దేశాలలో కార్మికులతో చేతి

వృత్తులవారితో కలిసి ప్రజాస్వామిక పరిపాలనను సాధించుకొనే అవకాశాలనుండి రైతులను తప్పించివేశారు. పెట్టుబడిదారీ విధానం ఏమి చేసిందో సరిగ్గా ప్రపంచ కమ్యూనిజంకూడా అదే చేసింది; స్వాతంత్ర్యంతో తేలియాడుతున్న చైతన్యవంతమైన రైతాంగాన్ని అణచివేసింది.

ఇట్టి అపవిత్రమైన పద్ధతితో, రష్యా చుట్టుప్రక్కల వున్న ఆగ్నేయ ఐరోపా దేశాలన్నిటిలోనూ సాంఘిక ఆర్థిక విధానాన్ని కమ్యూనిస్టు అధికారం నాశనం చేసింది. చైనాలో కూడ సోవియట్ దుమారము క్రిందకు వచ్చినప్పుడు దాని రైతాంగపు భవిష్యత్తు అంతా నాశనమవుతున్నట్లు కనిపెట్టారు. వారి రైతాంగం సోవియట్ కమ్యూనిస్ట్ ప్రభుత్వంమీద అనూహ్యమైన విజయాన్ని సాధించారు. మొట్టమొదటగా మనం యుగోస్లావియా రైతులను వారి విజయానికి అభినందించాలి.

వారి సహాయ నిరాకరణవలన, వెన్నుపోటు పొడిచే ఉద్యమంవలన, బహిరంగ తిరుగుబాట్లతో, సమయానుకూలంగా కమ్యూనిస్టు పార్టీతో కలిసి పనిజేస్తూ రైతులచే సహకారాన్ని సన్నగిలజేయడంలో వారి పరపతిని వాడుకొనే విధానంద్వారా అప్పటి మావో ప్రభుత్వాన్నికూడా తమ మాట వినేట్లుచేసి వారావిజయాన్ని సాధించారు. యుగోస్లావియాలో సహకార సంఘాలను వదలివేయడానికి అక్కడ రైతులకు టిటో అనుజ్ఞనిచ్చాడు. దాని పర్యవసానమేమిటంటే

ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలలో ఎక్కువ సంఖ్య రద్దయి పోయినవి. వాటిలోని రైతులకు సహకార సంఘాలు పెట్టుకోవడానికి అవకాశాలుయిచ్చారు. చాలాచోట్ల రైతులు సహకారసంఘాల్లో అలాగే వుండడానికిగాని, లేక స్వతంత్రంగా పనిచేసుకోవడానికిగాని స్వేచ్ఛనిచ్చారు. యుగోస్లోవియాలో సహకార సంఘాలలోని మెజారిటి సభ్యులుకూడ సహకార వ్యవసాయానికి బయట వుండడానికే యిష్టపడుతున్నారు. ఐరోపాలోని కమ్యూనిజం రైతులతో సంబంధాలలో విఫలమైన దృష్ట్యా చైనామాత్రం తెలివిగా ప్రవర్తించింది. అది రైతులపట్ల మృదువుగాను, ఎక్కువ శతృత్వము లేకుండాను, తక్కువ నిర్బంధంతోను వుండే విధానాన్ని అనుసరించింది. రైతులు ప్రభుత్వక్షేత్రాలలోగాని, సమష్టి క్షేత్రాలలోగాని సభ్యులైనప్పటికిని, ప్రతిచోటా వారికిదగ్గరగా అర ఎకరంనుండి రెండు ఎకరాలదాకా వుండే చిన్న కమతాలను వారు అట్టిపెట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వక్షేత్రాలలో బానిసకూలీలైన కోట్లకొద్ది చైనా రైతులిప్పుడు స్వంతదారులైన రైతులైనారు. వారి కమ్యూనిస్టుపార్టి బలవంతపు మార్పుకు బదులుగా శాంతియుత పరిణామాన్నే అనుసరిస్తున్నారు. రష్యాలోలాగా వారి సహకార సంఘాలింకా ఉత్సాహాన్ని పోగొట్టుకోలేదు. డబ్బుగాగాని, ధాన్యముగాగాని యిచ్చే కూలిరేట్లనుగూడా పెంచారు. ధరలు అదుపులో పెట్టబడినవి. వ్యావసాయిక వస్తువులు, పారిశ్రామిక వస్తువుల ధరలలోని అసమానతకూడా తగ్గించబడింది. కమ్యూనిస్టుపార్టి

భూమిని సంఘపరం జేసి, రైతాంగ ఆర్థిక విధానాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, రైతులు చాలా బలహీనతలతో బాధపడుతున్నప్పటికీ, వారి సేవలను కార్మిక వర్గంతో సమంగా, పున్నంతగా చూడకపోయినప్పటికీ, వారి బేరమాడే శక్తి పెరుగుతూనే వున్నది; స్వయంవృత్తి అవకాశాలు పెరుగుతూనేవున్నవి. యుగోస్లోవియాలో యిప్పటికికూడా సమష్టి క్షేత్రాల పలుకుబడి అంతగా లేదు. మెజారిటి రైతులు వాటిని బహిష్కరించి బయటపడుతున్నారు. ఈ రోజుకు కూడా ఆగ్నేయ ఐరోపా సోవియట్ దేశాలలోని రైతులు వారి సోవియట్ ప్రభుత్వాలక్రింద తీరిక లేకుండా పనిజేస్తున్నప్పటికి వ్యావసాయిక ప్రయత్నాలలో వారు వరుసగా విఫలమవుతూ వున్నారు. పెట్టుబడిదారి విధానంవల్లగాని, కమ్యూనిజంవల్లగాని రైతులు ఎక్కువకాలం అణచివేయబడలేరని, హీనపరచబడలేరనేది ఆవిధంగా వాస్తవమని ఋజువైంది.

ఇక్కడ భారత దేశంలోకూడా, స్వరాజ్యప్రభుత్వ ప్రణాళికావేత్తలు చైనా పద్ధతిలో నిర్బంధంగా రైతాంగ ఆర్థికవిధానాన్ని నశింపజేసి సహకార వ్యవసాయ ఉత్పత్తి పద్ధతిని ప్రవేశపెట్టాలి అని ఎంతో ధృఢమైన అభిప్రాయంతో బయలుదేరారు. వారు ప్రజాస్వామ్యాన్ని బోధిస్తూనే, వ్యవసాయం మాత్రం నిర్బంధ సహకార పద్ధతిన మార్పుచెందాలని ఆశించారు. యుద్ధకాలం నాటి కంట్రోళ్లు, నిర్బంధ ధాన్య సేకరణ, ఆర్థిక శాస్త్రవిరుద్ధంగా, బేసబబుగా

నిర్ణయింపబడిన ధరలు - అన్నీ కలిసిన వారి ప్రణాళికలు రైతులమీద విజయాన్ని సాధించడానికి దోహదకారులవు తాయని వారు వూహించారు. కాని 1951-52 లో వయోజన వోటింగు హక్కు-ద్వారా జరిగిన జనరల్ ఎన్నికలలో మద్రాసు, ఆంధ్ర, తిరువాన్కూరు - కొచ్చిన్ రాష్ట్రాలలో వారి నిర్బంధ రైతు వ్యతిరేక విధానాలవల్ల, కార్యక్రమాల వల్ల, రైతులలో అసమ్మతి పెరిగిపోయి కాంగ్రెసుపార్టీ ఓడించ బడింది. వెనుక స్టాలిన్ చేసినట్లుగా మన స్వరాజ్య ప్రభుత్వము చక్కగా, తెలివిగాసమైన సమయాలలోనే వెనక్కు మళ్లింది. ప్రణాళికా వేత్తలు నిర్బంధ సహకార విధానమనే కేకను వదలివేశారు. "రెండవ పంచవర్ష ప్రణాళికాముసాయిదా" (Draft outline of the Second - Five year Plan) లో భారత ప్రణాళికా వేత్తలు, "గ్రామాలలోని ఎక్కువ విశాల మైన ప్రాంతము ఒక మొత్తంగా మేనేజిమెంటు యూనిట్ అని భావించినప్పటికి; అనేక సంవత్సరాల తరబడి రైతు కమతమే ఆచరణలో సహజమైన యూనిట్" అని ఒప్పు కున్నారు. (P 69) ఇంకా "అట్టి సహకార గ్రామీణ అజమాయిషీ తన భావనలో 'భూమిమీద స్వామ్యం రైతుదే' అనే దానికి ప్రథమ స్థానమిస్తుంది". అనేదికూడా ఒప్పు కున్నారు. నిజంగా యిది రైతుల విజయమే. ప్రభుత్వమూ, ప్రణాళికాధిపతులు, గోధుమ, వరి, యింకా యితర ధాన్యాల ధరల నిర్ణయ బాధ్యతను తీసుకొనడానికి ఒప్పుకొన్నారు. భారత రైతాంగానికున్న యిటీవల విజయమేమంటే, వారి

ప్రబల శత్రువైన కమ్యూనిస్టు పార్టీకూడా, ఎక్కువమందికి జీవనాధారాన్ని కల్పిస్తుంది కాబట్టి చిన్న కమతాల ఆర్థిక విధానమే పటిష్ఠమైనదని అంగీకరించటం! కాబట్టి ప్రపంచ రైతాంగం, సహకారోద్యమ బలంతో పెరుగుతున్న ప్రజా స్వామ్యంలో పటిష్ఠమైన రాజకీయ, ఆర్థిక అధికారంవైపు సాగిపోతున్నట్లుగా నమ్మవచ్చు.

గత నలభై సంవత్సరాలనుండి రష్యా నాయకత్వం క్రిందవున్న కోట్లాది రైతులు తమ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకో కుండా రైతులుగానే నిలబడగల్గడం నిజంగా ఆశ్చర్యపడవలసిన విషయం. ముంచివేస్తున్న బలమైన కార్మిక నియంతృత్వం మధ్య జీవిస్తున్నా ప్రత్యేక వర్గంగా తమ గుర్తింపును పోగొట్టుకోకుండా మనగలగడం ఆశ్చర్యపడవలసిన విషయమే. అది జయింప శక్యంగాని ఆత్మ; ఇది ప్రపంచములోని అన్ని వృత్తులకన్నా మొట్టమొదటివృత్తి, మిగతా వృత్తులన్నిటికిని మూలమైనదైన వ్యవసాయపు మనస్తత్వ ప్రభావం శాశ్వత మైనది.

రాష్ట్రప్రభుత్వాలు ఏర్పాటుచేసిన రెండువందలో అంత కంటె హెచ్చుగానోవున్న సహకార వ్యవసాయక్షేత్రాలలో, ఎకరానికి యెక్కువ ఆదాయపురేటుగాని, లేక ఎకరానికి ఎక్కువపంట రాలుబడిగాని ఏ ఒక్కదానిలోగాని లేదు అని కూడా వారు అంగీకరించారు. బరోడా జిల్లాలో ప్రయో గాత్మక పరిశీలన జరిపినప్పుడు వ్యక్తిగత కర్షక వ్యవసాయము, నిర్వహణ, మంచి రాలుబడి ఫలితాలనిచ్చిందని, కౌలుదారి

వ్యవసాయపద్ధతి రెండవదిగాను, సహకార వ్యవసాయము అన్నిటికంటె తక్కువ ఉత్పత్తి వచ్చిందని తెలుసుకున్నారు. ఈ పరిస్థితులలో రైత్వారీ ఆర్థికవిధానంలో, పట్టణ ప్రాంతాల సలహాదారులు కోరినట్లుగా సహకార వ్యవసాయాన్ని భారీ పద్ధతిలో ప్రవేశపెట్టడానికి భారత ప్రభుత్వం సహజంగా సందేహిస్తున్నది. మరొకవైపు భారత రైతాంగ ఉద్యమం, ప్రభుత్వంయొక్క భూములలోనే భూములు లేని వ్యవసాయ కూలీలను సభ్యులనుగా జేర్చుకొని సహకార వ్యవసాయ ప్రయోగాలను చేయమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. సమిష్టి లేక సహకార వ్యవసాయక్షేత్రాలకన్నా రైతు ఆర్థిక విధానమే ఉత్తమమైనదని, భారత దేశ పరిస్థితులలో అది ఎకరానికి ఎక్కువపంట రాలుబడి నివ్వగలదని, అదనపు ఆదాయాన్నిగూడా సమకూర్చి పెట్టడంలో శక్తివంతమైనదని యీ ఉద్యమం నచ్చచెప్తూవుంది.

రూజ్‌వెల్టు స్వర్గంపోయి వైట్‌హౌస్‌మీద రిపబ్లికన్ల ప్రాబల్యం పెరిగిన తర్వాతగూడా, ధరలస్థిరీకరణ, పరస్పర స్వామ్యం లక్ష్యాలైన విధానాలను విడనాడకుండా న్యూడీల్ శత్రువులను సహితం అమెరికా రైతుల నిర్మాణాత్మకశక్తి నిరోధించ గలిగింది.

ఆధునిక సామ్రాజ్యవాదంయొక్క చావుదెబ్బలనుండి, ఫ్యూడలిజం, కాపిటలిజం, ఇంపీరియలిజం అనే దుష్టత్రయం యొక్క అపవిత్రమైన కలయికనుండి ప్రపంచం రైతాంగం ఒకసారి వొడ్డునపడింది. వారు నాశనమయ్యే లక్షణాలు మళ్ళీ

కన్పించలేదు. ఐరోపా వలస ఆర్థిక విధానాన్ని వారు విజయవంతంగా బలహీనపర్చారు. ఐరోపాలోని చాలా దేశాలలో ఫ్యూడలిజాన్ని కూడా నాశనంచేశారు. పెద్దపెద్ద ఎస్టేట్లను విభజింపజేసి, చాలాఖండాలలో వారియొక్క గ్రామీణ ఆర్థిక విధానాన్ని రైత్వారీ పద్ధతిగా రూపొందించేట్లుగా ప్రభుత్వాల మీద వత్తిడి తెచ్చారు. కమ్యూనిస్టు రాజ్యాలలోని భయంకరమైన సోవియట్ విధానానికి వ్యతిరేకంగా వారు ఎడతెగని పోరాటాలు సల్పుతున్నారు. కనుక పందొమ్మిదవ శతాబ్దపు మధ్యభాగంలోలాగా, ఆధునిక రైతాంగం "నాశనమయ్యే వర్గం" అని ఎవరైనా అపప్రథ కల్గించాలని చెబితే అది తప్పుడుతనమే అవుతుంది.

నాజీ రాజ్యాలలో కూడా గడచిన యుద్ధకాలంలో రైతులు ప్రపంచ మార్కెట్ల వినాశకరమైన విధానాలనుండి రక్షణపొందారు. యుద్ధకాలంలో కూడా ఆహార పదార్థాలు తరుగుగావున్న ప్రాంతాలలో రైతులు పోరాడినంతవరకు సక్రమమైన ధరలనే సాధించుకున్నారు. రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన మొదటి దశాబ్దంలో వ్యావసాయిక ధరలస్థిరీకరణ జరపమని, సమగ్రమైన ధరలవిధానాన్ని అమలుజరపమని, కనీస కూలికి కనీసధరలకు హామీనిచ్చే బాధ్యతను స్వీకరించమని తమతమ ప్రభుత్వాలమీద రైతాంగం వత్తిడి తెచ్చింది. 1946 లో ధరల స్థిరీకరణ పరిశీలనకు ఒక కమిటీని నియమించేదానికి భారతరైతాంగ ఉద్యమం బ్రిటీషు ప్రభుత్వాన్ని ఒప్పించింది. స్వతంత్ర భారత దేశంలో కూడా, ప్రధానమైన ఆహార

పదార్థాల ధరలను సక్రమమైన స్థితిలో అదుపులో పెట్టే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించేటట్లు చేసింది. ఇవన్నీ చైతన్య యుతమైన రైతాంగం సాధించుకొన్న విజయాలు. "ప్రపంచం మొత్తంమీద ఏర్పడే ప్రభుత్వ ధరల బలపరచే విధానాలవల్ల "ప్రపంచ మార్కెట్లలో చాలా ప్రధానమైన వస్తువులలో స్వేచ్ఛాయుతమైన పోటీనిలవదు." ఎగుమతిదారులలో కూడా స్వేచ్ఛాయుతమైన పోటీ ఎక్కువకాలం నిలువలేదు" అని ఐ. యఫ్. ఎ. పి (I. F. A. P.) 1955 సర్వేలో వ్యక్తం చేసింది.

ఫ్యూడలిస్టు అనారోగ్యాలనుండి చెప్పాకో తగినంత మైనారిటి విమోచన చెందవలసి వున్నప్పటికి, ప్రపంచ మార్కెట్లనుండి మాత్రం చాలామంది స్వేచ్ఛను సంపాదించవలసివుంది. ఉదాహరణకు "చిలీలో స్వంతదారులుగానీ, కౌలుదారులుగానీ వ్యవసాయక ప్రజలలో నాల్గవవంతు మాత్రమే. నూటికి తొంభైవంతుల వెనిజులా భూమి నూటికి అయిదుగురి చేతులలో వున్నది. పెరాగ్వేలో నాలుగవవంతు భూమి కేవలం ఇరవై అయిదుగురి స్వంతం (Farming Around the world" – P 65).

భారతస్వరాజ్య ప్రభుత్వం సోషలిస్టు పద్ధతి సమాజాన్ని నిర్మించడానికి నిర్ణయం చేయడంవల్ల గ్రామీణ ప్రజలయొక్క రైతాంగం యొక్క భవితవ్యం యీ ప్రభుత్వ అధికారం క్రింద శుభంగా వుంటుందని హామీనివ్వడం అపాయకరమైనవిషయం. ఒకసంగతి గుర్తుంచుకోవాలి, రెండవ పంచవర్ష ప్రణాళికకు

సంపాదించిన నిధులలో, జనాభాలో డెబ్బై శాతముగాగల రైతులు రు 4885 కోట్ల రూపాయలు చెల్లిస్తే మిగిలిన జనాభా అంతా 7265 కోట్ల రూపాయిలు చెల్లించింది. భారతీయుని తలసరి ఆదాయం రు 330/- అయినప్పటికి, మూడు ఎకరాల కనీస కమతం గల్గిన రైతులకు – (రైతాంగంలో నలభై శాతం యింకా తక్కువ భూమిగల్గి వుంటారు.) ఐదుగురు గల కుటుంబపు సంవత్సర ఆదాయము రు 240/- మాత్రమే. వ్యవసాయ జనంలో 30 శాతంగాగల వ్యవసాయ కూలీలు, 80 శాతం భూమి స్వంతదారులు, కౌలుదారులు 1961 నాటికి వెనుకబడిన తరగతిగానే కొనసాగవలసి వస్తున్నది. అందువలన మనవారు ప్రవచించిన సోషలిస్టు పద్ధతి సమాజంలో సక్రమమైన అభివృద్ధి జరుగుతుందని మనం ఎలానమ్మేటట్లు? (See "The Plan and the Peasant – peasant Institute's Pamphlet) రైతులు వారి అవసరాలకు, అభిప్రాయాలకు విరుద్ధంగా జరుగుతున్న అన్యాయాలనుండి పరిరక్షించుకోవలసివుంది. అంతర్జాతీయ కర్షక సంస్థకు చెందిన డాక్టర్ డిమిట్రావ్ "సాంఘిక స్థితిగతులలోను, పట్టణ గ్రామీణ జీవన ప్రమాణాలలోను అసమానత వున్నది. ఇంకా పట్టణాలవారికోరికల కనుగుణంగా, అన్యాయమైన అసంబద్ధమైన వ్యాపార నిర్ణయాలతో కూడిన క్రూరమైన దోపిడీవిధానం వారిమీద రుద్దబడుతువుంది" అని ఆరోపించాడు.

ఆఫ్రికా విభజన నాటినుండి జరుగుతూవున్న దేమంటే లక్షలాది జనాన్ని బానిసలుగా మార్చాలని వంశపారంపర్యంగా

పూర్వీకులనుండి వస్తున్న భూములనుండి వారిని తొలగించటం ఐరోపా తోటలలోనికి వారి కుటుంబాలను తోలటం ఎల్లప్పుడు స్వయం సమృద్ధిగల్గిన వారి సాంఘిక ఆర్థిక జీవనాలను అపవిత్ర పరచి ప్రత్యేక పరచటం!!

ఐరోపాలోను, అమెరికా లాంటి పెట్టుబడిదారి దేశాల లోను, ఆసియా లాటిన్ ఇండో అమెరికాలలోని వలసరాజ్యాల లోను, స్వేచ్ఛా వ్యావసాయిక దేశాలలోను. సోవియట్ బాల్కన్ రాజ్యాలలోను. ఆసియా ఆఫ్రికా అస్వతంత్ర వలస రాజ్యాలలోను రైతులు ప్రధానమైన వారి రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛలను తిరిగి సంపాదించుకొనే సమయానికి పెట్టుబడిదారీ విధానంతో పోరాడవలసివచ్చిన ఆధునిక కార్మికవర్గం వున్నట్టి స్థితిలోనే కాకపోతే కనీసం నేటికార్మికవర్గం వున్నట్టి స్థితిలోనే- రైతులు సహితం వున్నారు. అప్పటిదాకా, రైతాంగం పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా నిలబడడానికి అశక్తులని ఎవరైనా అంటే అది అన్యాయమే అవుతుంది. కార్మిక వర్గం లాగే బలమైన శక్తితో, సామ్రాజ్య వాద వ్యతిరేకంగా, పెట్టుబడి దారులకు విరుద్ధంగా, ఆత్మ స్థైర్యంతో, నిర్మాణాత్మక మైన పోరాటంతో ఇరవైయవ శతాబ్దంలో రైతులు సాగించిన విప్లవాత్మకమైన కార్యకలాపాలనుచూచిన ప్రతి ఒక్కరూ, వారు కార్మికవర్గానికంటె ఏమీ తీసిపోరని తీర్పు నివ్వవలసి వస్తుంది.

పెట్టుబడిదారి విధానంతో పోరాటంలో రైతాంగం తన పాత్రను క్రమంగా నిర్వర్తించింది అని మనలో మనం తృప్తి పడడానికి, ఒకవిషయం పరిశీలించాలి; ఏమిటంటే వారు పెట్టుబడిదారి విధానంమీద వారియుక్తులతో, శక్తినంతా కూడ గట్టుకొని, తిరిగి సాధించుకోగల్గిన బలంతో ఎక్కువ వత్తిడి చూపించారా లేదా అని. అయితే పెట్టుబడిదారి విధానం మీద వారు చేసిన పోరాటంచాలా శక్తివంతమైనది, కార్మిక వర్గమంతటి విప్లవాత్మకమైన. ఉద్రేకవంతమైన పోరాటమని చెప్పడంలో అనుమానించవలసిన అవసరంలేదు. బాల్కాన్, రష్యా దేశాల రైతులు, భారతరైతు సత్యాగ్రహులు, 1911 లాటిన్ అమెరికా విప్లవాలు, యింకా విశిష్టంగా మెక్సికోలోని పోరాటం, చైనారైతు తిరుగుబాట్లు, జపాన్ దురాక్రమణ దారులపై ప్రజాపోరాటం సాధించిన అధికారము; ఐరిష్ రైతాంగంయొక్క స్వాతంత్ర్య పోరాటము, సహకారోద్యమము, డేనిష్ ప్రజల ఫోక్‌స్కూల్సు (Folk Schools) వారి సహకార వ్యవస్థ, అమెరికా రైతుల తిరుగుబాట్లు, వ్యవసాయ సంస్థలను విధ్వంసపరచే వారికి వ్యతిరేకంగా వీరు చేసిన ఉద్యమాలు ప్రపంచ రైతాంగం త్రోసివేయ నలవికాని శక్తి అని ఋజువుచేసినవి.

మార్క్సు, యింకాకొందరు శాస్త్రీయ కమ్యూనిస్టులు వూహించినట్లు, పెట్టుబడిదారి వ్యవసాయ విధానానికి ఆధునిక సామ్రాజ్యవాద సహకారంతో పెట్టుబడిదారి విధానం, ఫ్యూడలిజం, దుష్టమైన అపవిత్రమైన కలయికతో సాగించిన దుర్మా

ర్గాలకు లొంగిపోవడానికి బదులు ప్రపంచ రైతాంగం ఫ్యూడల్ పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేకంగా పోరాటాన్ని సాగిస్తూ దానిని చావుదెబ్బలు కొట్టింది.

"చిన్నతరహా రైతుల వ్యవసాయానికి, స్వతంత్ర చేతి వృత్తులవారికి" పెట్టుబడిదారి విధానం స్థానం కన్పిస్తుందని మార్క్సు చెప్పాడు. ఎందుకంటె వారిద్దరూ "కొంతవరకు ఫ్యూడల్ పద్ధతి ఉత్పత్తి విధానానికి పునాదులు, ఫ్యూడల్ పద్ధతిపోయిన తర్వాత పెట్టుదారి ఉత్పత్తి విధానానికి ప్రక్క ప్రక్కనే బాసటగా కన్పిస్తారు." అని చెప్పారు. (Capital Vol I)

ఒకవిధంగా స్వతంత్ర రైతాంగం అభివృద్ధికి, అలాగే స్వతంత్ర కార్మికవర్గ అభివృద్ధికి పెట్టుబడిదారి విధానం చేయూతనిచ్చిందని చెప్పవచ్చు. ఐరోపా ప్రజలకు ముందువారి ఫ్యూడల్ వ్యవస్థనుండి సరియైన స్వేచ్ఛనిచ్చి ఆధునికమైన ఫాక్టరీలలో కూలీలుగా చేరే అవకాశాలను వారికి కన్పించక పోయినట్లైతే వారి పారిశ్రామికోద్యమము భారీయంత్రసామాగ్రితో, అధికోత్పత్తులతో ఆ విధంగా అభివృద్ధి చెందియుండెడిది కాదు. అలాగే రైతులకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలనిచ్చి ఎంతో క్రమశిక్షణతో, సామర్థ్యంతో, వాణిజ్యపంటలను కావలసినంత మొత్తాలలో పండించే అవకాశాలను కల్పించక పోయినట్లైతే, వారి ప్రధానమైన పారిశ్రామిక విధానము, ఆధునిక వ్యాపార రంగం, దాని ఆయుధమైన ప్రపంచ మార్కెటు యింత అభివృద్ధిని చెందియుండేవి కావు. కాబట్టి, తూర్పువలసలలో,

సంశయిస్తూనే కౌలునిర్ణయాన్ని స్థిరమైన స్వాధనానికి కొన్ని హామీలనివ్వటానికి ప్రాథమికమైన నిర్ణయాలు తీసుకున్నారు. వాస్తవాన్ని తెలుసుకోవడానికి 1844 లో ఏర్పడిన ప్రత్తిమీద బ్రిటిష్ హౌస్ ఆఫ్ కామన్స్ కమిటీనుండి, 1926-28 లో భారత వ్యవసాయంమీద వచ్చిన రాయల్ కమిషన్ వరకు వచ్చిన పార్లమెంటరీ కమిటీల కార్యకలాపాలను పరిశీలిస్తే తెలుసుకోవచ్చును. లాంక్ షైర్ బట్టలమిల్లులవారు, లండను వ్యాపారస్థులు అప్పుపెట్టడంద్వారా భూములు కౌలుకిచ్చే పద్ధతులతోను, వివిధములైన వ్యాపారపంటలను పండించడంలోను, వారి అప్పులను తీర్చడంలోను, బ్రిటీషు వ్యాపారస్థులకు పెద్ద మార్కెట్లను ఏర్పాటుచేయడంలోను భారత దేశానికిగల శక్తిని తగ్గించడంకాని, వారిమీద హద్దులు పెట్టడంకాని చేయకూడదని ఆదుర్దాపడుతున్నారు. తోడుదొంగలలో ఒకమైన పెట్టుబడిదారీ విధానంవల్ల లభిస్తున్నప్పటికి-పంధొమ్మిదవ శతాబ్దంలోని ఇంగ్లాండు "స్వతంత్ర కార్మికవర్గానికి లాగునే, స్వతంత్ర రైతాంగానికికూడా మంచి సహాయం లభించింది."

తాము ప్రవేశపెట్టిన భారీ తోటల పద్ధతి వాస్తవమైన లాభాలను కూర్చడం లేదని ఎప్పుడైతే తెలుసుకున్నారో పెట్టుబడిదారులు గోల్డుకోస్టు, నైజీరియాలోని నీగ్రోలకు చిన్న కమతాల పద్ధతిని ప్రవేశపెట్టి వారికి తలవంచారు. ఆఫ్రికా పశ్చిమతీరంలోగూడా కోకో, ప్రత్తి, సినాల్ మొదలగు వాణిజ్యపంటల అభివృద్ధికోసం రైత్వారీ వ్యవసాయ పద్ధతిని రేపారు. ఆ విధంగానే "వెట్టిచాకిరి", "కిరాయికూలి"

పద్ధతులుకూడా వదలివేయబడ్డవి. "స్వతంత్ర రైతాంగము" "చిన్నకమతాల" పద్ధతులతో సహకరించడానికి పెట్టుబడిదారి విధానం తన స్వార్థంకోసం స్థానికంగాగాని, అంతర్జాతీయంగాగాని ఫ్యూడలిజంతోగల సహచర్యాన్ని వదులుకోవలసివచ్చింది. పెట్టుబడిదారి విధానం తన కార్యకలాపాల స్వభావంవల్లనే, తనంతట తాను హరించుకుపోయి, తన వారసుడుగా తన వుత్పత్తి ఫలితాన్ని తెచ్చుకోవలసిందిపోయి ఆధునిక రైతాంగం, కార్మికవర్గం అనే రెండుఫలితాల్ని అనివార్యమైన వారసులుగా తీసుకొనివచ్చింది. కార్మిక ఆర్థిక విధానంమాత్రమే వుండాలి అనే సిద్ధాంతంతో బుద్ధిని పెంచుకొని, కార్మికవర్గం ఒక్కటే పెట్టుబడిదారీ విధానం తర్వాత ఆక్రమించగల వారసత్వం గల్గినది అని భావించే శాస్త్రీయ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా యీ సారాంశము వుంటుందని నాకు తెలుసు. వారికిగాని, మనకుగాని వాస్తవాలు మధ్యవర్తులుగా తీర్పు చెప్పవలసినదే.

తిరుగులేని, అడ్డ శక్యముగాని స్వభావంగల్గిన రైతులు మాత్రమే, ఫ్యూడలిజం, పెట్టుబడిదారీ విధానాల అధికార ప్రభావంనుండి ఎక్కువ స్వేచ్ఛను పొందాలని ప్రయత్నిస్తున్నారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం యొక్క ఆధునిక ప్రపంచపు కుళ్ళు ప్రవేశపెట్టిన బ్రహ్మాండమైన సమస్యల్ని ఎదుర్కొనేటప్పుడు, గడచిన ఆర్థిక మాంద్యము, రెండు ప్రపంచయుద్ధాలు, పారంపర్యంగా వస్తున్న ప్రాంతీయ తత్వము, వుదాసీనత, నిస్సహాయస్థితి మొదలగునవి రైతాం

గాన్ని కదలించివేసినవి. అమెరికా రైతులను, భారత రైతు వుద్యమాలను, చైనా కమ్యూనిస్టులను, సన్ యట్ సేన్ సిద్ధాంత త్రయాన్ని ప్రెసిడెంట్ కార్డినాజ్ యొక్క మెక్సికో భూసంస్కరణలను, డాక్టర్ పెనాలో యొక్క అర్జెంటీనా వ్యాపారవిధానాల (Inside Latin America; John Gunther) ను చూచి వారుకూడా తమంతటతాము, నిర్మాణాత్మకముగా వారికోరికలను తయారుచేసుకుంటున్నారు. వారి యీనాటి దురవస్థకు కారణభూతమేమిటో యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. స్వేచ్ఛా ప్రపంచంలోని పెట్టుబడిదారీ వర్గాలు, సోవియట్ ప్రపంచంలోని పట్టణ ప్రాంతాల జనం, కార్మికవర్గం వారి దోపిడీకి కారణాలని వారికి అర్థమైంది. ప్రజాస్వామ్య రాజ్యాలలో లాగే పారిశ్రామిక వ్యవసాయిక ధరల స్థితిలో సమానత కావాలని వారు కోరడాన్ని యిది తెలియచేస్తుంది. నేటి పెట్టుబడిదారి సిద్ధాంతము నాశనమైతే తప్ప, అధికార యంత్రాంగం కార్మికులు పట్టుకుంటే తప్ప, కార్మికుల సంక్షేమం పూర్తిగా సాధించుకున్నట్లు కాదు. అంతవరకు వారికి హామీ లభించినట్లుకాదు. అదే విధంగా పెట్టుబడిదారీ అధికారాన్ని, సామ్రాజ్యవాద వత్తిడిని బదాబదలుచేసి సోవియట్ హింసావిధానాన్ని వోడించి, రాజకీయ ఆర్థిక అధికారంలో వారి భాగాన్ని వారు సంపాదించుకుంటే తప్ప రైతులు పూర్తి సంతృప్తిని పొందలేరు. అప్పుడుగాని వాణిజ్య పారిశ్రామికవృత్తి వర్గాలవారిలాగే రైతులు, వారు చేసిన శ్రమకు తగిన ఫలితాన్ని పొందలేరు. దోపిడినుండి

విమోచన సాధించడానికి పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేయవలసిన అవసరం కార్మికవర్గం ఒక్కదానికే వుందని, విప్లవముయొక్క అవసరాన్నిగురించి ఎల్లప్పుడు ఆలోచించేది కార్మికవర్గమొక్కటేనని, వారికి మాత్రమే విప్లవాత్మకమైన కోరికలుగలవని ఆలోచిస్తూ దానితో సమానమైన కోరికలు గల పెట్టుబడిదారీ విధానంనుండి, సామ్రాజ్యవాదంనుండి విముక్తిని సాధించుకోవలసిన అవసరంగల్గిన రైతువర్గాన్ని నిర్లక్ష్యం చేయడమంటే పిచ్చివాడి స్వర్గంలో వున్నట్లే కాగలదు. ఆధునిక సాంఘిక జీవితవిధానపు అనివార్యమైన వాస్తవాలను మభ్యపరుస్తున్నట్లే కాగలదు.

రైతులకు భవిష్యత్తులేదని, పెట్టుబడిదారీ విధానం హరించకుండా తమను రక్షించుకోడానికి మాత్రమే వారు పోరాడుతున్నారని ఆలోచించేకాలం పోయింది. రైతులకు వ్యతిరేకంగా కాపిటలిస్టు పోరాటంలో ఒకనిర్ణయానికి రావడానికి సరియైన హేతువున్నది. చరిత్రయిచ్చిన తీర్పు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగావున్నది. ఫ్యూడలిజం, పెట్టుబడిదారీ విధానాల మూలంలోనికి రైతాంగం యింకా చొచ్చుకుపోతూనే వున్నది. దోపిడినుండి విముక్తి పొందడానికి చేసే పోరాటాన్ని, పటిష్ఠమైన పూర్తి స్వేచ్ఛ వైపు తోసుకుపోతున్న రైతాంగ గమనాన్ని భూమిమీదవున్న ఏశక్తీ నిరోధించజాలదు. ఏ వర్గమైనా తమకు జరిగే అన్యాయమైన దోపిడినుండి రక్షింపబడవలసినదే. అట్టి ధర్మబద్ధమైన, అత్యా

వళ్యకమైన కృషిని రైతాంగం మహా విజయవంతంగా చేస్తుంది. తృప్తికరమైన ఫలితాలు కానలసిన దృష్ట్యా ఆధునిక సాంఘిక విధానప్రగతి, తప్పనిసరి ఆవశ్యకమైనదై నందువల్ల పెట్టుబడిదారీ విధానం, సోవియటిజం వారిపై విధించిన అసహ్యాకరమైన అడ్డంకులనుండి రైతాంగం విధిగా స్వేచ్ఛను కోరుకోవలసివస్తుంది. సామాజిక వుత్పత్తి వనరుల పునర్నిర్మాణంలోను, సమాజంలోని అన్నివర్గాలకు వారివారి కృషికి శ్రమను, ఉత్పాదకశక్తినిబట్టి దామాషాగా సమాజ సంపదను ఆదాయాన్ని పునర్విభజనచేయడంలోను పటిష్ఠమైన ప్రాబల్యాన్ని సంపాదించడానికి రైతులు సాంఘిక ఆర్థిక అధికారంలో భాగాన్ని కోరుకుంటున్నారు.

ఎంతోనమ్మకమైన, తీవ్రమైన ఆశావాద కంఠాలతో ఒళ్లు జలదరించే ప్రతిపదంలో, వారి రైతు సాహిత్యం విడిచే స్వేచ్ఛావాయువులో, పద్యాలలో, పోరాటాలలో ఒక క్రొత్త వుద్రేకం ప్రపంచ రైతు జనాల హృదయాలను వుద్వేగపరుస్తున్నది. అదే ఆంధ్ర రైతులు 1934 నుండి, చైనా రైతులు 1937 నుండి సాగిస్తున్న కార్యక్రమం. ప్రఖ్యాతమైన సెట్టిపల్లి (కర్షకయువకుడు) గీతాలు భారతీయ రైతాంగ హృదయాలలో వుద్రేకాలను రగిలించినవి. అనురాగము, భక్తితో, పరవశించిన దివ్యమైన భావనలు; నిరాశ, చెడిపోయిన మానసికస్థితి, శతాబ్దాల పర్యంతము నిట్టూర్పు విడిచిన విషాదము, పీటితోనిండిన కరుణాపూరితమైన విషాద గీతాలు నేడు వాడుకలోలేవు. భారత దేశంలో ఎంతో

చైనాలో అంత. బాల్కన్ దేశాలలో ఎంతో మెక్సికోలో అంత. ఇది సాహసకృత్యాలయుగం. అనేక నమ్మకాల, కలల విప్లవాత్మకమైన ఆశయాల రైతుప్రాంగణం. రష్యావిప్లవము, దానిసమష్టి విధానము వారు రైతులను పెట్టిన బాధలు నిజంగా ఒక హెచ్చరిక; ఒక కనువిప్పు.

వెనుకటిలాగా పట్టణాలమీద పల్లెలు ఆధారపడి వుండడం, పట్టణ సంస్కృతినిచూచి పోటీలో గ్రామీణ జనాలు తాము తక్కువగా భావించుకోవడం, రైతులు భయోత్పాతంతో చెవులు కొరుక్కొనడం, కార్మిక వర్గాన్ని చూడగనే శ్వాసబిగపట్టుకోవడం, ఇవన్నీ కూడా మార్క్సుకంటె ఆలోచన తక్కువగల వారము కాము అనే ధోరణిలో వారు తీసుకొన్న పెట్టుబడిదారి విధానం మీద విజయం సాధించాలనే మహత్తరమైన, చరిత్రాత్మకమైన మార్గానికి దోహదాలైనవి. ఆధునిక రైతాంగం ఎంతో నమ్మకంతో, గొప్ప ఆశయంతో సాధించుకోవాలనుకునే సంఘంలో 1937 సోవియట్ రాజ్యాంగం చేసిన దానికంటె ఎక్కువ ప్రజాస్వామిక హక్కులను హామీనిస్తూంది. రష్యా యింకా యితర సోవియట్ రాజ్యాలలోలాగా కేవలం కార్మిక వర్గాన్నే సింహాసనంమీద కూర్చోబెట్టకుండా, రైతులను, కూలీలను, కళాకారులను, చేతివృత్తులవారిని. యింకా యితర శ్రామిక వర్గాలవారిని కూడా సాంఘిక జీవనంలో వాస్తవమైన అధికారంలో సమాన భాగస్వాములు కాగల అవకాశాన్ని కల్పిస్తుంది.

# రైతులు ఒక ప్రత్యేకమైనవర్గం

రైతులు ఒక వర్గంకాదని కొందరు భ్రాన్త్వదృష్టికల్గిన సోషలిస్టులు చెప్తున్నారు. "సర్వసాధారణంగా వర్గాలంటే ఏమిటి? సంఘంలోని ఒకభాగం భూమినంతటిని స్వంతంచేసుకుంటే అప్పుడు భూస్వాములు, రైతులు అనే రెండువర్గాలు ఏర్పడుతవి. అలాగే సంఘంలోని ఒకభాగం పరిశ్రమను స్వంతం చేసుకుంటే మిగిలినభాగం వారికోసం పనిచేస్తుంది. అప్పుడు పెట్టుబడిదారులు, కార్మికులు అనే వర్గాలు ఏర్పడతవి." అని లెనిన్ చెప్పాడు. (Quoted by Leontiev).

కాని ఎక్కడైతే దోపిడి వర్గాలైన భూస్వాములు పెట్టుబడిదారులు కలిసి పనిచేస్తూ, రైతులను కార్మికులను బలి పశువులనుచేసి దోచుకుంటారో అక్కడ రెండు దోపిడివర్గాలు వాటికి వ్యతిరేకంగా రెండు దోపిడి చేయబడే వర్గాలు ఏర్పడతవి. శాస్త్రీయ కమ్యూనిస్టులవలె తనను తాను మోసపుచ్చుకొనే తర్కంతో వాటిని ఒకవైపు ఒకప్రధానమైన వర్గంగాను మరొకవైపు రెండవ వర్గంగాను తీర్మానానికివస్తే అది నిజాలను నిర్లక్ష్యం చేయడమే అవుతుంది. ఇంకా తమ సిద్ధాంతాల చట్రములోనికి నిజాన్ని యిమిడేట్టుచేసే ప్రయత్నమే అవుతుంది.

కార్మికవర్గం కూలికోసం ఫ్యాక్టరీలలో ఒకే అనుభవంతో కలిసి ఎలాగు పనిచేస్తున్నారో ఆ విధంగానే రైతులుకూడా రాత్రి అనక, పగలనక తమ నేలతల్లిమీద చాకిరిచేస్తున్నారు.

ఫ్యాక్టరీలలో పనిచేస్తూ కార్మికులు వారి బాధలకు కారణా లేమిటో వారిలోవారు చర్చించుకొని వాటినుండి విముక్తి చెందడానికి అందరూకలిసి పోరాటం సాగించాలి అని నిర్ణయా నికి వస్తారు. అట్లాగే రైతులుకూడా రకరకాలైన ఫ్యాక్టరీ లకు మార్కెట్లకు తమ ఉత్పత్తులను అమ్ముకొనడానికి తీసుకు వెళ్ళినపుడు వారందరినీ పీడిస్తున్న సర్వసామాన్యమైన బాధ లేమిటో గుర్తించి వాటిని బాపుకొనడానికి అందరూ కలిసి సంఘాన్ని నిర్మించుకుంటారు. పెట్టుబడిదారీ విధానం తన ఫ్యాక్టరీలద్వారా కార్మికులనే గాక రైతులనుకూడా ఆత్మ రక్షణకోసం సంఘాలను పెట్టుకొనేటట్లు చేసింది. రైతువర్గం కూడా కార్మికులలాగే పెట్టుబడిదారీ దోపిడికి బలిఅయింది. రెండువర్గాలు కూడా యీ భయంకరమైన దోపిడీ స్వభావం హద్దులు ఏమిటో తెలుసుకొని వాటినుండి విముక్తి చెందడానికి ఐక్యతతో, ఫలవంతంగా సాగించే పోరాటంలో సారూప్యత వుంటుంది. పారిశ్రామిక వేత్తలు కార్మికవర్గంమీద పెత్తనం చేస్తూ కష్టాలకు గురిచేస్తున్నట్లే పెట్టుబడిదారీ పీఠంలో పూజారులైన భూస్వాములు, వడ్డీవ్యాపారస్తులు, పన్నువసూలు దార్లు, వ్యాపారస్తులు, సామ్రాజ్యవాదులు, తదితరులు తమకు గల దోపిడికి సహాయపడే అన్ని హంగులతో రైతులను వినాశ కరమైన బాధలకు గురిచేస్తున్నారు.

అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానం, ప్రపంచ మార్కెట్లు, యింకా సామ్రాజ్యవాదం రైతులయొక్క ఆర్థిక సాంఘిక హీనస్థితికి ఆయుధాలైనవి. ఈ విధంగావచ్చే దురవ

స్థలను భరించి ప్రపంచ రైతాంగం దానినుండి విమోచన సాధించడానికి అంతా ఒక త్రాటిమీద ఐక్యతతో కలిసి పని చేయడం అనివార్యమని గుర్తించింది. తమకు పరమశత్రువైన, నిర్దాక్షిణ్యమైన, కర్కశమైన దోపిడీదారుమీద అందరూ కలిసి ఒక త్రాటిమీద బలమైన శక్తిగా నిలబడి పోరాటం సాగించడానికి రైతాంగం ఒకే వైపుకు విధిగా నెట్టబడింది. బూర్జువా పెట్టుబడిదార్ల భోషాణాలలోనికి మూన్నూటామూన్నూ వుండగనే రోజూ ప్రవాహంలాగా పోతూవున్న తమ సంపదను ఆపడానికి, వారి ప్రాణాధారమునే తినివేసే యీ మురికినుండి కాపాడుకోడానికి, రైతాంగం ఐక్యతతో, క్రమశిక్షణతో, జాతీయంగా అంతర్జాతీయంగా పెట్టుబడిదారులవల్ల పీడితులైన యితర వర్గాలను కలుపుకొని పోరాటం సాగించవలసి వచ్చింది.

ప్రపంచంలోని అన్ని దేశాల రైతులు – విశిష్టంగా వలస రాజ్యాలలోని రైతాంగం ఒక ప్రత్యేకమైనవర్గం. వారు ఒకే రకమైన బాధలనుండి విముక్తి చెందాలి. భయంకరమైన దైన్య స్థితినుండి బయటపడాలి. బలమైన శత్రువులను జయించాలి. ఇంకా విప్లవాత్మకమైన ఉద్యమాన్ని నడుపుకుంటూ సామాజిక పునర్నిర్మాణాన్ని సాధించుకోవాలి. రైతాంగ ఐక్యత, ఏకాగ్ర దృష్టి, వారి విప్లవానికి కావలసిన అవసరాలు, మార్గాలు, పెట్టుబడిదారీ దోపిడిమీద వారికిగల అణచివేయలేని పగఅనే విశిష్ట లక్షణాలు కార్మికవర్గంతో సహా మిగతా అన్నివర్గాలకంటె రైతాంగ వర్గపు బలాన్ని ఎక్కువస్థాయికి పెంచుతుంది. ఈ

మహత్తరమైన లక్షణాలను నిర్లక్ష్యంచేసి ఎవరైతే తప్పి పోతారో వారు గట్టిగా విప్లవప్రతిఘాత శక్తిగా, తిరుగుబాటు దారుగా రూపొందుతున్నారన్నమాట.

కమ్యూనిస్టు మానిఫెస్టోలో మార్క్సు చేసిన ప్రకటన ఎంత పాక్షికమైనదో యిప్పుడు మనం పరిశీలించవచ్చు. "దాని (పెట్టుబడిదారీ విధానం) పతనం, కార్మికవర్గ విజయం రెండూ సమానంగా అనివార్యమే." కేవలం కార్మికవర్గం మీదే వున్న యీ గ్రుడ్డి నిమగ్నతను ఆధునిక రైతులు సహించరు. ఇంకా మార్క్సు చెబుతూ "నేటి బూర్జువా వర్గాన్ని ఎదుర్కొనే వర్గాలన్నిటిలోను కార్మికవర్గంమాత్రమే వాస్తవంగా విప్లవాత్మకమైనది." అంటాడు. కాని కార్మిక వర్గంమాత్రమే విప్లవం నడిపించడానికి సమ్యకమైన సక్రమ మైన శక్తిగా చాలదని, అందువల్ల కేవలం కార్మికవర్గాన్ని మాత్రమే విప్లవశక్తిగా గుర్తించడం అన్యాయమని తర్వాత ప్రపంచ చరిత్ర ఋజువు చేసింది.

ఇక్కడ మరొక అన్యాయమైన ప్రవచనమున్నది. "చిన్నతరహా మధ్యతరగతివారు, చేతివృత్తులవారు, రైతులు మొదలగు అందరూ మధ్యతరగతిలో భాగాలై తమ మను గడను రక్షించుకోవాలనే ఆశయంతో బూర్జువా వర్గంతో పోరాడతారు". ఆవిధంగా రైతులకు, చేతివృత్తులవారికి విరుద్ధంగా శాస్త్రీయ కమ్యూనిస్టులకు యీనాడు యేర్పడిన దురభిప్రాయాలకు పునాదులువేస్తూ మార్క్సు "వారు అభి వృద్ధి నిరోధకులు, వారు చారిత్రక రథచక్రాలను వెనక్కు

త్రిప్పడానికి ప్రయత్నిస్తుంటారు" అన్నాడు. సాంఘిక విప్లవాన్ని సాధించుకోవడంలో రైతులను నమ్మవద్దు అని కమ్యూనిస్టులను హెచ్చరిస్తాడు. ఆవిధంగా ఆధునిక కమ్యూనిస్టులలో స్థిరపడిన పగ రైతులను అపనమ్మకంతోను, నిర్లక్ష్యంతోను చూడడానికి పనికివచ్చింది. దాని పర్యవసానంగా రైతులుకూడ తమకు అపాయకరమైన, నమ్మకములేని మిత్రునిపై సహజమైన అపనమ్మకాన్ని వ్యక్తంచేశారు. లాసల్‌ను వ్యతిరేకంగా మార్క్సు వాదిస్తూ కార్మికవర్గం తప్ప మిగిలిన అన్ని వర్గాలు విప్లవప్రతీఘాత శక్తులే అని ఒక అసందిగ్ధమైన ప్రకటన చేశాడు. ఆయన అట్లా దృఢముగా చేసిన ప్రకటన ఎంత నిజాయితీగా సహజముగా వున్నప్పటికి వెనుక మానిఫెస్టోలో చేసిన ప్రకటనకంటే తర్వాతవచ్చిన శిష్యులదృష్టిని ఆకర్షించ లేకపోయింది. ఆవిధంగా రైతులకు వ్యతిరేకంగా దారుణమైన తప్పు చేసికూడా మార్క్సుతో సహా యీ శాస్త్రీయ కమ్యూనిస్టులు ఫ్రెంచి కమ్యూను నుండి లెనిన్, స్టాలిన్ వరకు గడచిన రోజులులాగనే రైతులు కార్మికవర్గ ధ్వజం చుట్టూ కడువిశ్వాసంతో తిరుగుతారని స్వాభావికంగా వూహించారు. ఇంకా కార్మికవర్గం అధికారంలోనికి రావడానికి రైతులు సహాయపడతారని, కార్మికనియంతృత్వాన్ని బలపరుస్తారని, వారి పంటలమీద వేసిన మిలిటరి లెవీలనన్నింటిని ఎంతో సాధువుగా చెల్లిస్తారనీ, వారి క్రొత్త యజమానులను మేపడానికి సమష్టి వ్యవసాయ క్షేత్రాలలోనికి చొచ్చుకొని వస్తారని యీ మార్క్సిస్టులు ఆశించారు.

అసలువాణ్ణి వదిలిపెట్టి ఆలోచనలుచేశారు. ఆధునిక ప్రపంచంలోని రైతు బాగా మేల్కొంటున్నాడు. రష్యా కార్మిక నియంతృత్వం తన సోదరరైతుల్ని పెడుతున్న కష్టాలను చూచి గుణపాఠం నేర్చుకుంటున్నారు. రష్యా కమ్యూనిస్టుల అనుచరులు, యింకా ఎర్రసైన్యము ఆగ్నేయ ఐరోపాలో రైతు ప్రజాస్వామ్యాల్ని ఏ విధంగా అణచివేస్తున్నారో తెలుసుకుంటున్నారు. శ్రామిక వర్గాలన్ని కలిసి ఐక్యసంఘటన నేర్పరచుకుందామని మార్క్సిస్టులు వేసే బలవంతపు కేకల వెనుక తమను విప్లవ ప్రతీఘాత శక్తిగా సృష్టించిన మార్క్సు అభిప్రాయాలు, రష్యా కార్మిక నియంతృత్వపు గుత్తాధిపత్యము వున్నవని అతనికి తెలుసు. కాబట్టి మేలుకున్న ఆధునిక కర్షకుని యొక్క మానసికస్థితిని, స్వభావాన్ని, విప్లవాత్మకమైన ప్రేరణని, చారిత్రకస్థితిని, అభిప్రాయాలని, ఆశయాలను ప్రపంచములోని సోషలిస్టులందరూ బాగా అర్థంచేసుకోవలసిన సమయం ఆసన్నమైంది.

రైతులు అభివృద్ధి నిరోధకులని, అభ్యుదయ గడియారపు ముళ్ళను వెనక్కు త్రిప్పుతారని శాస్త్రీయ కమ్యూనిస్టులు చేసే ఆరోపణలో ఎక్కడా న్యాయంకనపడదు. అట్టి అభ్యుదయ గమనాన్ని పెట్టుబడిదారివిధానం సాధించలేదని జనాలందరికి స్పష్టంగా తెలుస్తూనేవున్నది. కాబట్టి అట్టి పెట్టుబడిదారి పద్ధతిని వ్యతిరేకించడం అభివృద్ధి నిరోధకతత్వంకాదు. కేవలం విప్లవాత్మకమే. మొదటినుండి చెప్పుకుంటున్నట్లుగానే పెట్టుబడిదారీ విధానం "పరమ అపకీర్తికరమైన, నీచమైన హీనమైన, పరమ

అసహ్యాకరమైన, మనస్తత్వముతో కూడుకున్నట్టిది." అది ప్రతి రంధ్రమునుండి రక్తాన్ని పిండుతుంది. కాంగో, లాటిన్ సెంట్రల్ అమెరికాలలో జరిగిన భయానకమైన బానిసల తోలకంలాగానే దాని విజయం ప్రపంచంలోని మానవ సమాజం మొత్తాన్ని చెప్పడానికి వీలుగానంత దౌర్భాగ్యపు స్థితిలోనికి త్రోసి వేస్తుంది. అస్సాం, నీలగిరి, కీన్యా వున్నత ప్రాంతము, మలయా, ఇండోచైనా, వెస్టిండీస్, మొదలగు ప్రాంతాల తోటలలో, ఇంకా బ్రెజిల్, అర్జెంటీనా, యు. యస్. ఎ. పొలాలలో జరిగినట్లుగా పెద్ద పెద్ద భారీ వస్తుసామగ్రులతో ఎంతో సమర్థవంతంగా, నిర్మాణాత్మకమైన పద్ధతిలో, భారీ పద్ధతిలో వ్యవసాయాన్ని సాగించడానికి పెట్టుబడిదారీ విధానం ఎక్కడ ప్రయత్నించినా, భయంకరమైన, అమానుషమైన రక్తపాతము, బాధలు, జీవితాలు ఛిన్నాభిన్నం కావడం, హత్యలూ తప్ప మరేవిధమైన ఫలితాలనూ, సాధించలేక పోయింది. ప్రపంచం మొత్తానికి యీ అనుభవమంటేనే వెగటు పుట్టింది. దాని సమర్థకులే వారి కార్యక్రమాన్ని చూచి విచారపడుతున్నారు. ఎంతోమంది గుర్తుతెలియని, అసహాయులు బలియై చిందించిన నెత్తురులోనుండి పొందిన లాభాలను చూచుకొని దాని భాగస్తులే సిగ్గుపడుతున్నారు. పెట్టుబడిదారి విధానం దానింతట అదే రైత్వారీ వ్యవసాయ విధానానికి తలవంచింది.

అంతటి భయోత్పాతంనుండి విముక్తి సాధించుకోవడం "చారిత్రక రథచక్రాలను వెనక్కు మళ్ళించడం" కాదు.

భూములను దున్నుతూనే, ఎదుగుతున్న పెట్టుబడిదారి పరిశ్రమలకు, వ్యాపారాలకు తక్కువ కాలంలో వివిధ రకాలైన పంటలను వారి కోరికల కనుగుణంగా, తృప్తికరంగా అందిస్తూ అదే సమయములో ప్రపంచములోని జనబాహుళ్యముయొక్క జీవిత పరిస్థితులను దైన్యస్థితికి నెట్టుకుపోయే పెట్టుబడిదారీ విధానాన్ని హద్దులలో వుంచగల్గడం రైతాంగంయొక్క విప్లవాత్మకమైన ఘనవిజయం. ఆ గొప్పతనం ప్రపంచంలోని రైతు జనాలదే.

అందువల్లనే, రైత్వారి ఆర్థిక వ్యవస్థ "నాశనంకావాలి, నాశనమై తీరుతుంది". "దాని శాశ్వతమైన మనుగడను ఎవరైనా కోరుకుంటే, అది ప్రాపంచికమైన అధమత్వాన్ని శాశ్వతం చేయడానికి శాసనం చేయడమే అవుతుంది" అని మార్క్సు ప్రకటిస్తే మనం అంగీకరించ తిరస్కరిస్తున్నాము. "శతాబ్దాల తరబడి సంఘాలలో నిలదొక్కుకున్న సంస్కృతులకు కారణం వారు వారి బాధ్యతలను గుర్తించడం; విశ్వాసముతో ఆచరించడం" అని సి. సి. టేలర్ గుర్తించాడు.

1923 లో జరిగిన కమ్యూనిస్టుల అంతర్జాతీయ రైతుల (Red Peasant International) మొదటి మహాసభలో మార్క్సిస్టులు "ఇంతవరకు ఎక్కడా ఏ దేశమూ రైతులచే పాలింపబడలేదు. వాళ్ళు ఎల్లప్పుడూ పోరాడతారు; ప్రతిసారి ఓడించబడ్డారు." అని చెప్పారు. (Quoted in the I. P. U Journal August 1955). ఇంతకంటె మూర్ఖమైన తప్పుడు ఆరోపణ ఎక్కడైనా వుంటుందా? మాస్కోలో రైతు

ప్రాతినిధ్యంలేని రైతుసభ జరుగుతున్నప్పటికి, వారు బల్గేరియా లోని స్టాంబొలిస్కి విప్లవ రైతురాజ్యపు వునికినే నిర్లక్ష్యం చేశారు. హంగరీ కమ్యూనిస్టు వాంగా ఆ సమావేశంలో మాట్లాడుతూ "ఇటీవలి సంవత్సరాలలో రైతులో వర్గ మనస్తత్వం బాగా పెరిగింది. మధ్య తూర్పు ఐరోపాలో వారంతటవారు రాజకీయ పార్టీలుగా ఏర్పడి మధ్యతరగతులతో కలిసిగాని, కలవకుండాగాని అధికారాన్ని చేతికి చిక్కించుకోడానికి ప్రయత్నించారు" అన్నాడు (I. P. U. 1955 August). చెకొస్లొవేకియాలో 1922 నుండి 1938 వరకు ఆంటోనిస్వెటా, మిలాన్‌హోజాల నాయకత్వాన వారు ప్రధాన మంత్రి, మంత్రులుగా రిపబ్లికన్ పెజంట్సు పార్టీ అధికారములోనున్నది. 1950 సంవత్సరము వరకు జరిగిన ఇరవై సంవత్సరాలకాలం పెజెంట్సు పార్టీ స్వీడన్‌లో సమష్టిమంత్రి వర్గాలలో భాగస్వామిగా వున్నది. డెన్మార్కులోగూడ రైతు ప్రధానమంత్రిగా రైతు మంత్రివర్గంవున్నది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలోని రైతుపార్టీలు, లేబరు పార్టీలతో పోటీ పడుతూ ప్రత్యామ్నాయ మంత్రివర్గాలను ఏర్పరచినవి.

ఎక్కువ ఉత్పత్తి పంపిణీలకు అనుగుణంగా భారీ వ్యవసాయ క్షేత్రాలు వుండాలనేది ఆధునిక యుగపు లక్షణం; రైతులకు చిన్నకమతాలపైగల ప్రేమ ఆధునికయుగపు ధ్యేయానికి వ్యతిరేకంగా నడుస్తుంది అని మార్క్సిస్టులు, వారి అడుగుజాడలలో నడిచే సోషలిస్టులు చెప్తున్నారు. ఆధునిక సంఘంలో వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ ఏర్పడడంకోసరం,

రైత్వారీ ఆర్థికవిధానం, ఆర్థిక రాజకీయ అధికారాలను పంచుతుంది. ఈ సోషలిస్టులకు కేంద్రీకృతమైన భారీ వ్యవస్థల మీద ప్రేమ వున్నందున, పటిష్ఠమైన అభ్యుదయకరమైన ఆర్థిక సంపదయొక్క పంపిణీని గుర్తించ లేకపోతున్నారు. "ఎక్కువ మొత్తాల ఉత్పత్తి, వృథాపోని పంపిణీ విధానము మొదలగు అవకాశాలను" సంతరించుకొన్న గొప్ప వ్యావసాయిక సహకారోద్యమంయొక్క విప్లవాత్మకమైన లక్షణాన్ని గుర్తించడంలో విఫలమైనారు. రైత్వారీ ఆర్థికవిధానాన్ని, కేవలం వ్యవసాయోత్పత్తిని పిండిజేయడంగానే భావించారు. వారు చివరకు రైతులను సహకార సంఘాలతో కలిపి ఆలోచించే టప్పుడుకూడా సహకార వ్యవస్థలోని నిజమైన జీవసమేమిటో తెలిసికోలేక, కమ్యూనిస్టు దేశాలన్నిటిలో ఏమి చేశారో అలాగే ప్రతి సహకార సంఘాన్ని ఒక నిర్బంధ సంస్థగా మార్చారు (I. P. U. June 1951).

మిగతా శ్రామిక వర్గాలన్నిటిని వదిలివేసి వారంతట వారే అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకుంటున్నారనీ, రైతు పార్టీలకు, రైతు సంస్థలకు, రైతు నాయకులకు వ్యతిరేకంగా ఎప్పటికప్పుడు వారిపై తప్పుడు ఆరోపణలు చేయబడినవి. ఇక్కడ భారత దేశంలో రైతు, కూలీ, కళాకారబుద్ధిజీవి రాజ్యం కావాలని మనం విశదంగా చెప్పాము. రాజకీయ, ఆర్థికమైన అధికారం శ్రమజీవులందరికి రావలయునని, ఒకవేళ రైతులకు మిగతావారంతా నాయకత్వాన్ని అప్పగించినా, శ్రామిక వర్గాల జనాల పరిపూర్ణమైన సహకారంతోనే ఆపని

చేస్తాము. స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య అభ్యుదయకరమైన
యీ ధ్యేయాన్ని 1944 నవంబరులో మహాత్మాగాంధి ప్రజా
స్వామిక రైతు కూలీ ప్రజారాజ్యంగా నిర్వచించారు.
ఆ విధంగానే అంతర్జాతీయ రైతు వ్యవస్థ (గ్రీన్ ఇంటర్నేష
నల్)లో "అంతర్జాతీయ రైతు వ్యవస్థ-రైతుల శ్రేయస్సును
మదింపు చేసేప్పుడు, ఇతర ఉత్పత్తి దారులతో, ముఖ్యంగా
కార్మికవర్గాలు స్వయంవృత్తులవారి శ్రేయస్సులతో ఘర్షణకు
రాగల సంకుచిత పరిష్కారాలను వాంఛించదు. కాకపోగా
మానవ సంక్షేమము, శాంతియుతమైన ప్రగతి పునాదులుగా
యీ అన్నివర్గాల శ్రేయస్సులను సమన్వయపర్చ అది ఆలో
చిస్తుంది." అని ప్రవచించారు. విఫలమైన రెడ్ పెజంట్
ఇంటర్నేషనల్ మొదటి మహాసభలో చెప్పినట్లుగా కమ్యూ
నిస్టుల విధానమంతా వారికి రైతుల యందుగల హేయమైన
అపనమ్మకము, అసహ్యము, యింకా రైతాంగ ఐక్యతను
భగ్నంచేయడానికి వారు చేసే తంత్రాలమీద ఆధారపడి
వుంటుంది. ఈ రైతాంగ వ్యతిరేక సిద్ధాంతాలు, రాజకీయ
విధానాలు కారణంగా కమ్యూనిస్టులు రష్యా రైతాంగాన్ని
పలువిధాలైన బాధలకు గురిచేయడం చూచి ఆగ్నేయ ఐరోపా
రాజ్యాలలోని పెద్దరైతు పార్టీలన్ని, రష్యా నాయకుల పెద్దరి
కంతో అనుకోకుండా అధికారంలోనికి వచ్చిన కమ్యూనిస్టు
ప్రభుత్వాలన్నిటికీ తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించినవి. ఈ దేశా
లన్నిటిలోను ప్రభుత్వాలమీద కమ్యూనిస్టులు అధికారానికి
ఎప్పుడైతే వచ్చారో, వారు స్వతంత్ర కర్షక సహకార సంస్థ
లనూ, రాజకీయ పార్టీలను చురుకుగా నాశనంచేసి, వ్యవసాయ
ఆర్థిక వ్యవస్థలమీద, సోవియట్ పద్ధతి సమష్టి, సహకార

క్షేత్రాలను దించారు. వారి దాస్యానికి రైతులు ఎప్పుడు తిరిగారంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. దానిఫలితం రైతులు కావాలని చెడగొట్టే ప్రయత్నం, సహాయ నిరాకరణ పనిలో నీరసంగా సాగడం మొదలగు పద్ధతులను సాగించి మిగతా ప్రాంతాలలో పెట్టుబడిదారీ దాస్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్లే సోవియట్ దేశాలలోని రైతులు యీ క్రొత్తరకం దాస్యానికి వ్యతిరేకంగా పోరాడటానికి తమ శక్తిని ప్రదర్శిస్తున్నారు.

రైతులు ఎక్కడవున్నా స్వేచ్ఛాప్రియులే. ఏ రకమైన దోపిడీగాని, దాస్యంగాని దానికి వ్యతిరేకంగా వారు ఎడతెగకుండాగాని, విడివిడిగాని పోరాడుతూనే వుంటారు. డాక్టర్ డిమిట్రావ్ స్వాతంత్ర్యము, అభ్యుదయ పరిరక్షకులైన వీరులుగా వారిని సరిగానే అభినందించారు. వారు "స్వేచ్ఛగల్గిన వ్యక్తులుగా నాశనంచేసి, వారిని క్రమశిక్షణతో వారికి ఉపయుక్తమయ్యే పద్ధతిలో సాగే యంత్రాంగ స్థాయికి వత్తిడితోను, కుట్రతోను దిగజార్చాలని ప్రయత్నిస్తున్న వంచకులతోను, విశ్వాస ఘాతకులతోను జరుగుతున్న ఎడతెగని పోరాటంలో నిమగ్నమైన వీరులు" గా అభివర్ణించాడు (I. P. U. 1951)

తూర్పు, పశ్చిమ దేశాలలోని ఎక్కువమంది రైతులకు వర్గతత్వాన్ని సంపాదించుకోవడానికి ప్రపంచం మొత్తంలోని వారి ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి, రెండవ ప్రపంచ యుద్ధం ఎంతో సహాకరించింది. వారి వారి దేశాలయొక్క ఆర్థిక సౌభాగ్యానికి వారిపాత్ర ఎంతో వారు చూడగలిగారు.

యుద్ధం ముగిసిన తర్వాత మొదటి ప్రపంచ వ్యవసాయదారుల మహాసభ 1946 మే లో లండన్‌లో జరిగింది. భారత రైతు కాంగ్రెసుకూడా అందులో పాల్గొన్నది. ఆ మహాసభలో అంతర్జాతీయ వ్యవసాయ వృత్తిదారుల సంఘం (International Federation of Agricultural Producers) స్థాపించబడింది. ఆ సంఘం ఆశయాలు చాలా గొప్పవి. జాతీయాదాయాన్ని, సంపదను శ్రామికవర్గాలన్నిటికి సమానంగా పంపిణీ చేయాలి. అధికోత్పత్తి, సక్రమమైన ధరలు కావాలి. ప్రపంచ రైతాంగాన్ని వారికిగల నిర్మాణాత్మకమైన బలంతో, ప్రపంచ సామాజిక ప్రాంగణంలోనికి ఆ సంస్థ యీ విధంగా తీసుకురావడానికి ప్రయత్నించింది. దాని ఇటీవలి అభిప్రాయమేమిటంటే రైతుని భిన్నమార్గాలతో కూడిన ఆర్థిక అభివృద్ధివైపుకు మరలించడమే. దురదృష్టమేమిటంటే ఆగ్నేయ ఐరోపాలలోని రైతు ప్రజాస్వామ్యాలన్ని రష్యా సైన్య సహకారంతో కమ్యూనిస్టు ప్రభుత్వాలచేత అణచివేయబడుతున్నవి. అయినప్పటికి రైతులు, యీ క్రొత్త శత్రువులమీద పోరాటాన్ని ఆపలేదు. అందుకోసమే అంతర్జాతీయ రైతు సంస్థ (I. P. U.)-గ్రీన్ ఇంటర్నేషనల్‌ను పునర్నిర్మాణం చేశారు. ప్రజాస్వామిక రైతువర్గానికి అది విప్లవాత్మకమైన రాజకీయ నాయకత్వాన్నిస్తుంది.

ఇటీవలి సంవత్సరాలలో ఆధునిక రైతు ప్రజాస్వామ్యాన్ని తనను ప్రధానమైన బలంగాను, నియంతృత్వాన్ని పెద్దశత్రువుగాను భావిస్తున్నాడు. తనవర్గంమీద అది ప్రయోగిస్తున్న తంత్రాలవల్ల కమ్యూనిజం కూడ పెట్టుబడిదారి విధానం యొక్క పాత్రను పుణికిపుచ్చుకున్నదని అతడు గుర్తించాడు

పెట్టుబడిదారీ విధానాన్ని, సోవియటిజాన్ని రెండింటితో కూడా ఒకేసారి పోరాడవలసిన అవసరమేర్పడిందని అతడు నిర్ణయానికి వచ్చాడు. వీటన్నిటి ఫలితంగా తనాభివృద్ధ్యభ్యుదయమంతా సహకారోద్యమంలో వున్నదని ఎంతో విచక్షణతో అతడు పరిశీలించాడు. పెట్టుబడిదారీవిధానం సోవియటిజంయొక్క తప్పును సట్టివేయడానికి తన రాజకీయమైన బలాన్ని పెంచుకోవాలని, సహకారోద్యమాన్ని బలపరచాలని, ఆర్థిక కార్యక్రమాలన్నిట నిర్మాణాత్మకమైన శక్తిని సంపాదించాలని తద్వారా తనవర్గానికి పాతక్రొత్త శత్రువులైన వారిమీంచ రాజకీయ విజయాన్ని సాధించాలని కృషిప్రారంభించాడు. కాబట్టి ప్రపంచప్రాంగణంలో అతని కార్యక్రమాలు పెరిగినవి.

అందువల్లనే రైతు ఉద్యమం ప్రపంచమంతా ప్రాకిపోయింది. అన్ని దేశాల రైతుకార్యకర్తలలోను రైతుసంస్థలు బలాన్ని పుంజుకుంటూన్నవి. ప్రపంచ రైతాంగంలో ఎక్కడ చూచినా ఒక క్రొత్త కార్యక్రమము, మేలుకొలుపు కన్పిస్తున్నవి. అందుకే ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థను, ఐక్యరాజ్యసమితి పౌరహక్కుల పత్రాన్ని వారు ఉత్సాహానంతంగా బలపరుస్తున్నారు. వారి ఆత్మ ప్రజాస్వామ్య, కిసాన్, మజ్దూర్, కళాకార్, బుద్ధి జీవిరాజ్యాన్ని సాధించుకోవడానికే ప్రయత్నిస్తుంది.